ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా వార్తలు
శుక్రవారం 13 జూన్ 2025 | 3





రామచంద్రపురంలో మంత్రి సుభాష్ కేక్ కటింగ్ సందడి

వేడుకగా..

ఏడాది పాలనపై కూటమి శ్రేణుల విజయోత్సవాలు

ఎమ్మెల్యేల ఆధ్వర్యంలో కేక్‌ల కటింగ్

ఎక్కడికక్కడ ఊరేగింపులు.. పాల్గొన్న నేతలు

నియోజకవర్గాల్లో పలుచోట్ల బైక్ ర్యాలీలు



తాళ్లరేవులో కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే బుచ్చిబాబు





మండపేటలో విజయోత్సవ ర్యాలీలో ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు.. అమలాపురంలో ఎమ్మెల్యే ఆనందరావు ఆధ్వర్యంలో కేక్ కటింగ్





పి.గన్నవరంలో ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ కేక్ కటింగ్ సందడి.. మలికిపురంలో విజయోత్సవ సభలో ఎమ్మెల్యే దేవ వరప్రసాద్

అమలాపురం, జూన్ 12(ఆంధ్రజ్యోతి): కోనసీమ జిల్లాలోని వివిధ నియోజకవర్గాల్లో చంద్రబాబు ప్రభుత్వం ఏడాది పాలన పూర్తిచేసిన సందర్భం నేపథ్యంలో గురువారం సంబరాలు అంబరాన్నంటాయి. టీడీపీ, జనసేన, బీజేపీ శ్రేణులు కొన్నిచోట్ల వేర్వేరుగా కార్యక్రమాలు నిర్వహించినప్పటికీ మరికొన్నిచోట్ల ఐక్యతా ర్యాలీలు హోరెత్తిపోయాయి. కేక్‌లు కట్‌చేసి బాణసంచా కాల్చి సంబరాలు చేసుకున్నారు. పెద్దసంఖ్యలో పార్టీ శ్రేణులు కార్యక్రమంలో పాల్గొన్నారు. అమలాపురం పట్టణం గడియార స్తంభం సెంటర్‌లో టీడీపీ నాయకుల ఆధ్వర్యంలో వేడుకలు హోరెత్తిపోయాయి. ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు ఆధ్వర్యంలో పార్టీ నాయకులు కేక్ కట్‌చేసి విజయోత్సవాలను ఘనంగా జరుపుకున్నారు. ఎమ్మెల్యే ఆనందరావుతోపాటు టీడీపీ రాష్ట్ర నాయకులు మెట్ల రమణబాబు, డీసీఎంఎస్ చైర్మన్ పెచ్చెట్టి చంద్రమౌళి, టీడీపీ పట్టణాధ్యక్షుడు తిక్కిరెడ్డి నేతాజీ, పార్టీ నాయకులు మట్టా మహాలక్ష్మి ప్రభాకర్, దెందుకూరి సత్తిబాబురాజు, బోనం సత్తిబాబు, మల్లుల పోలయ్య, అధికారి జయవెంకటలక్ష్మి, మాకిరెడ్డి పోర్నిమ, వందల సంఖ్యలో వేడుకకు హాజరయ్యారు. అలాగే రామచంద్రపురంలో కార్మికశాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ ఆధ్వర్యంలో ఏడాది పాలన వేడుకలు జరిగాయి. రావులపాలెంలో జనసేన నేత బండారు శ్రీను ఆధ్వర్యంలో భారీ ర్యాలీ చేపట్టారు. కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు ఆధ్వర్యంలో వివిధ ప్రాంతాల్లో కేక్ కటింగ్‌లు, విజయోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. పి.గన్నవరంలో జనసేన ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ, రాజోలు నియోజకవర్గంలో ఎమ్మెల్యే దేవవరప్రసాద్, ముమ్మిడివరం నియోజకవర్గంలో ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు (బుచ్చిబాబు), మండపేటలో ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు ఆధ్వర్యంలో విజయోత్సవ ర్యాలీలు జరిగాయి. కేక్ కట్‌చేసి సందడి చేశారు. భారీసంఖ్యలో కూటమి నేతలు పాల్గొన్నారు. మరికొన్నిచోట్ల బైక్ ర్యాలీలు నిర్వహించి సంబరాలు చేసుకున్నారు.



రావులపాలెంలో విజయోత్సవ ర్యాలీలో కొత్తపేట ఎమ్మెల్యే బండారు

అమ్మకు.. ఆనందమే!



రాజమహేంద్రవరం ఎస్‌కేవీటీ పాఠశాలలో తొలిరోజు ఆనందం

నేటి నుంచి తల్లికి వందనం అమలు

- నిధులు విడుదల చేసిన ప్రభుత్వం
- ఇక తల్లుల ఖాతాలకు జమ
- విద్యార్థులు 5.88 లక్షలు
- ఉమ్మడి జిల్లాకు రూ.882 కోట్లు
- జూలై 5 వరకు అమలు
- అనుకోని ప్రమాదంతో ఆలస్యం
- కూటమి పండుగ వాయిదా
- ఆందోళన వద్దు : జిల్లా కలెక్టర్

(రాజమహేంద్రవరం/ అమలాపురం-ఆంధ్రజ్యోతి)

చంద్రబాబు సూపర్‌సిక్స్ హామీల అమలుకు పట్టుదలతో ఉన్నారు.. ఒక్కో హామీని నెరవేర్చుకుంటూ వస్తున్నారు. తాజాగా గురువారం తల్లికి వందనం హామీకి గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు. ఈ మేరకు ప్రభుత్వం బ్యాంకులకు నగదు జమచేసింది. దీంతో శుక్రవారం సాయంత్రానికి తల్లికి వందనం అమలయ్యే సూచనలు కనిపిస్తున్నాయి. ప్రతి ఒక్కరి ఫోన్ తల్లికి వందనం మెసేజ్‌లతో ట్రింగ్‌ట్రింగ్ అంటూ మోగుతుందని నాయకులు చెబుతున్నారు. ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసినప్పటికీ ఈ ప్రక్రియ ఈ నెల 12 నుంచి వచ్చే నెల 5వ తేదీ వరకు కొనసాగేలా మార్గదర్శకాలు విడుదల చేశారు. తొలి విడతగా రెండో తరగతి నుంచి పదో తరగతి, ఇంటర్ సెకండియర్ విద్యార్థులకు తల్లికి వందనం వర్తింపచేయనున్నారు. అయితే ఒకటో తరగతి, ఇంటర్ ఫస్టియర్ విద్యార్థులకు మాత్రం వారి అడ్మిషన్లు పూర్తయ్యాక జమ చేస్తారు.

తల్లిదండ్రుల ఎదురుచూపులు..

తల్లికి వందనం డబ్బులు గురువారం ఖాతాల్లో జమవుతాయని కాకినాడ, డాక్టర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాతోపాటు తూర్పుగోదావరి, ఏజెన్సీల్లోని లబ్ధిదారులు ఎదురుచూశారు. ఎన్నికల్లో సీఎం చంద్రబాబు హామీ ఇచ్చిన మేరకు ప్రతి విద్యార్థికి రూ.15 వేలు చొప్పున ఎందరున్నా ఇస్తారని అనుకున్నారు. గురువారం రాత్రి వరకూ ఫోన్‌కు మెసేజ్ వస్తుందని చాలామంది చూస్తూనే ఉన్నారు. మరికొందరు సాంకేతిక ఇబ్బంది అయి ఉంటుందని సచివాలయాలకు వెళ్లారు. వాళ్ల సొమ్ములు పడతాయని చెప్పడం తప్ప కానీ సమాచారం లేదు. ఈనెల 12తో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది అవుతోంది. ఆ వేడుకల్లో తల్లికి వందనం లబ్ధిదారులను భాగస్వాములను చేద్దామని ప్రభుత్వం భావించింది. కానీ అహ్మదాబాద్‌లో ఎయిరిండియా విమానం కూలిపోవడంతో 242 మంది మృత్యువాత పడ్డారు. ప్రాణాల కంటే వేడుకలు ముఖ్యం కాదని భావించిన ప్రభుత్వం వేడుకలను వాయిదా వేసింది. దీంతో తల్లికి వందనం సొమ్ము పడడం కాస్త ఆలస్యమవుతోందని సమాచారం.

జిల్లాల వారీగా ఇదీ లెక్క..

జిల్లా	విద్యార్థులు	తల్లులు	నిధులు(కోట్లలో)
తూర్పు	188726	123779	283
కోనసీమ	170869	112419	256
కాకినాడ	228781	149403	343

అనుకోని ఘటనతో..

లబ్ధిదారుల వివరాలు సచివాలయాల సంక్షేమ అసిస్టెంట్ల లాగిన్‌కి చేరుకున్నాయి. ఆ మేరకు శుక్రవారం నుంచి అమలు మొదలు అవుతోందని చెబుతున్నారు. ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని తూర్పుగోదావరి కలెక్టర్ ప్రశాంతి పేర్కొన్నారు. తల్లికి వందనం డబ్బులు ఆయా తల్లుల ఖాతాల్లో డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్‌ఫర్ విధానంలో జమ చేయనున్నారు. జిల్లాలోని లబ్ధిదారుల ఎంపిక ఇప్పటికే పూర్తి చేశారు. అయితే అనుకోని విపత్తు సంభవించడంతో రెండు రోజుల ఆలస్యం జరిగినా తల్లికి వందనం కచ్చితంగా అందజేయనున్నారు. తల్లికి వందనం ద్వారా అందించాల్సిన డబ్బులను ఇప్పటికే ప్రభుత్వం కేటాయించి ఆయా జిల్లాలకు విడుదల చేసింది. ఈ మేరకు ప్రభుత్వ ఆదేశాలను జీవో రూపంలో గురువారమే జారీ చేశారు. గురువారం జమ కాకపోవడంతో చాలా మంది అసంతృప్తికి గురయ్యారని తెలుస్తోంది. సచివాలయ ఉద్యోగులకు ఫోన్లు చేయడం, సెల్‌ఫోన్లలో మెసేజ్‌లు పరిశీలించుకోవడం, సచివాలయాలకు వెళ్లడం చేశారు. జిల్లా యంత్రాంగం ముందుగానే ప్రకటన చేసి ఉంటే బాగుండేదని పలువురు వ్యాఖ్యానించారు.



కాకినాడ శాలిపేటలోని పాఠశాలకు వెళుతున్న బాలికలు

ఇవీ నిబంధనలు..

- పాఠశాలలు, విద్యాశాఖ ఇంటర్మీడియట్ బోర్డు సమన్వయంతో సమగ్ర డేటా సేకరణ
- కుటుంబ ఆదాయం నెలకు గ్రామాల్లో రూ.10 వేలు, పట్టణాల్లో రూ.12 వేలు మించరాదు.
- ఖచ్చితంగా బియ్యం కార్డు ఉండాలి.
- భూమి మూడు ఎకరాల కంటే తక్కువ ఉండాలి.
- నాలుగు చక్రాల వాహనం కలిగి ఉంటే (ట్రాక్టరు, ఆటోలకు మినహాయింపు) వారు అనర్హులు.
- నెలవారీ విద్యుత్ వినియోగం 300 యూనిట్ల కంటే తక్కువ ఉండాలి. 12 నెలల సగటు విద్యుత్ వినియోగాన్ని పరిగణనలోకి తీసుకుంటారు.
- కుటుంబానికి వేయి చదరపు అడుగులకంటే ఎక్కువ విస్తీర్ణంలో మునిసిపల్ ఆస్తి ఉండకూడదు.
- కేంద్ర, రాష్ట్ర ప్రభుతాల్లో పీఎస్‌యూలు లేదా ప్రభుత్వ పెన్షన్ పొందుతుంటే అనర్హులు.
- పారిశుధ్య కార్మికులకు మినహాయింపు ఉంది.
- గ్రామాల్లో రూ.10 వేలు, పట్టణాల్లో రూ.12 వేలు జీతం పొందే ఉద్యోగులకు మినహాయింపు ఉంది.
- ఆదాయ పన్ను చెల్లిస్తే అర్హులు కారు.
- లబ్ధిదారుడి పిల్లలు ఏపీలో గుర్తింపు పొందిన ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో చదవాలి.
- ఈ విద్యా సంవత్సరంలో 75 శాతం హాజరు ఉన్న విద్యార్థి తదుపరి వచ్చే ఆర్థిక సంవత్సరానికి సహాయం పొందడానికి అర్హులు.
- డీబీటీ విధానంలో తల్లుల ఖాతాలకు జమ

జోరుగా తాబేళ్ల అక్రమ రవాణా

కాట్రేనికోన, జూన్ 12(ఆంధ్రజ్యోతి): కోనసీమ నుంచి తాబేళ్ల అక్రమ రవాణా ఆగడంలేదు. కాట్రేనికోన, అల్లవరం, ఉప్పలగుప్తం, ముమ్మిడివరం, ఐ.పోలవరం, తాళ్లరేవు తదితర మండలాల నుంచి తాబేళ్ల అక్రమ రవాణా జోరుగా సాగుతోంది. రామచంద్రపురం పరిసర ప్రాంతాలకు చెందిన కొందరు ద్విచక్ర వాహనాలకు సంచులు కట్టుకుని పంటకాల్వలు, బోదెల్లో తాబేళ్లు వేటాడుతున్నారు. వేటాడిన తాబేళ్లను ఒక చోటికి చేరుస్తున్నారు. వీటిని కంటైనర్ల ద్వారా ఒరిస్సా, పశ్చిమబెంగాల్ తదితర రాష్ట్రాలకు తరలిస్తున్నారు. కోనసీమ ప్రాంతంలో ఒక్కొక్క తాబేలు రూ.10 నుంచి రూ.20 వరకు ధర ఉంటే, ఇతర రాష్ట్రాల్లో వీటిని ఒక్కొక్కటి రూ.300 నుంచి రూ.500 వరకు విక్రయిస్తున్నారు. ఇటీవల ఫారెస్టు చెక్‌పోస్టుల వద్ద పట్టుబడుతున్న తాబేళ్లు కోనసీమ నుంచి వచ్చినవేనని అధికారులు సైతం చెబుతున్నారు.

అభివృద్ధి దిశగా..



జిల్లాలో సాధించిన ప్రగతి ఇది : జిల్లా కలెక్టర్

అమలాపురం, జూన్ 12(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తి చేసుకున్న తరుణంలో జిల్లాలోని అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను జిల్లా కలెక్టర్ మహేష్‌కుమార్ వెల్లడించారు. జిల్లాలో వివిధ కేటగిరిల్లో పెన్షన్ల వారీగా గత ప్రభుత్వం 18 కేటగిరిల్లో మార్చి 2024 వరకు ప్రతీ నెల రూ.71.33 కోట్లు చెల్లిస్తే, ప్రస్తుత ప్రభుత్వం ఏప్రిల్ 2024 నుంచి ఇప్పటివరకు 28 కేటగిరిల్లో ప్రతీ నెల రూ.101.15 కోట్లు పంపిణీ చేసినట్టు చెప్పారు. దీపం పథకం కింద 5.37 లక్షల మంది కార్డుదారులకు కేంద్ర ప్రభుత్వ సబ్సిడీ మొత్తాన్ని 48 గంటల్లోనే లబ్ధిదారుల ఖాతాకు జమ చేస్తున్నామన్నారు. ఆర్‌అండ్‌బీ శాఖ ద్వారా జిల్లాలో 159 పనులతో గుంతల రహిత రహదారుల నిర్మాణానికి రూ.38 కోట్లు కేటాయించగా, దీంతో 643.29 కిలోమీటర్ల మేర ప్రధాన రోడ్ల మరమ్మతులు, అభివృద్ధి చెందాయి. రూ.4 కోట్లతో అమలాపురం పట్టణ, నడిపూడి వద్ద రెండు వంతెనల నిర్మాణం జరుగుతున్నాయి. నాబార్డు విడుదల చేసిన రూ.4.22 కోట్లతో రెండు రోడ్ల పనులు చేపట్టామన్నారు. రబీ, ఖరీఫ్ సీజన్‌లో ధాన్యం సేకరణ చేపట్టి రైతులకు మద్దతు ధర కల్పించామన్నారు. డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం ద్వారా పాఠశాలలు, హాస్టల్ విద్యార్థులకు నాణ్యమైన సన్నబియ్యం పంపిణీ చేస్తున్నట్టు తెలిపారు. జిల్లాలో 62 హాస్టళ్లలో నాణ్యమైన 25 కిలోల బియ్యం వంతున 2,473 ప్యాకెట్లు పంపిణీ చేసినట్టు తెలిపారు. 1534 పాఠశాలల్లో 7,221 బియ్యం ప్యాకెట్లు పంపిణీ చేశామన్నారు. పీఎం గ్రామీణ సడక్ యోజన పథకం కింద రూ.13.52కోట్ల అంచనా వ్యయంతో రెండు పనులు చేపట్టామన్నారు. ఎస్డీఎంఎఫ్ పథకంలో రూ.4.40 కోట్ల అంచనాతో మూడు పనులు చేపట్టి 7.30 కిలోమీటర్ల పొడవునా రోడ్డు నిర్మాణం చేపట్టామని ఆయన తెలిపారు.

'సన్నబియ్యంతో మధ్యాహ్న భోజన పథకం ప్రారంభం'



అమలాపురం జడ్పీ ఉన్నత పాఠశాలలో గురువారం సన్నబియ్యంతో మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రారంభిస్తున్న ఉదయభాస్కర్

అమలాపురం టౌన్, జూన్ 12(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న మధ్యాహ్న భోజన పథకానికి గురువారం నుంచి సన్నబియ్యం అందించి జిల్లా పౌరసరఫరాల అధికారి అడపా ఉదయభాస్కర్ ప్రారంభించారు. విద్యార్థులకు పౌష్టికాహారం అందించడమే లక్ష్యంగా అమలాపురం జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో ఈ పథకాన్ని ప్రారంభించారు. గతంలో భోజనంలో నాణ్యత తక్కువగా ఉండడంతో ఎక్కువ మంది విద్యార్థులు భోజనం చేయడంలేదని ప్రభుత్వం గుర్తించిందన్నారు. దీనికి పరిష్కార మార్గంగా మధ్యాహ్న భోజన పథకానికి సన్నబియ్యం సరఫరా చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. జిల్లాలోనే 1534 ప్రభుత్వ పాఠశాలలు, 62 సంక్షేమ హాస్టళ్లకు 9694 బియ్యం ప్యాకెట్లను 25 కిలోల వంతున అందించామన్నారు. ఈ కార్యక్రమంలో ఉప విద్యాశాఖాధికారి గుబ్బల సూర్యప్రకాశం, హెచ్‌ఎం రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అవును.. అది రెడ్‌క్రాస్ కార్యాలయమే!

సబ్ జైలు ఆఫీసులో ఏర్పాటు



అమలాపురం సబ్‌జైలు సూపరింటెండెంట్ నివాస గృహమే రెడ్‌క్రాస్ సొసైటీ కార్యాలయం

అమలాపురం టౌన్, జూన్ 12(ఆంధ్రజ్యోతి): పై చిత్రంలో కనిపిస్తున్న భవనం ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లాశాఖ కార్యాలయమే. కానీ గతంలోకి వెళ్లి చూస్తే అది అమలాపురం సబ్‌జైల్ సూపరింటెండెంట్ అధికారిక నివాస భవనం. ఆ భవనానికి ఎదురుగా ఉన్న గేటుకు రెడ్‌క్రాస్ సొసైటీ కార్యాలయం అంటూ ఒక ఫ్లెక్సీని ఏర్పాటుచేశారు. గతంలో నిర్మించిన రెడ్‌క్రాస్ భవనం శిథిలం కావడం, సబ్‌జైలు మూతబడడంతో ఖాళీగా ఉన్న సూపరింటెండెంట్ నివాస భవనమే రెడ్‌క్రాస్ సొసైటీ కార్యాలయంగా మారిపోయింది. రెడ్‌క్రాస్ సొసైటీ కార్యాలయం ఎక్కడో ఉందని.. వెతకాల్సిన అవసరం లేదు. అమలాపురం సబ్‌జైలు గుర్తుంటే చాలు.

'భాగ్యనగర్' పరిశ్రమను వెంటనే తెరిపించాలి

● కంపెనీ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ డిమాండ్



పరిశ్రమ ఎదుట ధర్నా చేస్తున్న కార్మికులు, తదితరులు

గోపాలపురం, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): నగ్గొండలో మూసివేసిన భాగ్యనగర్ క్లోరైడ్ ప్రైవేట్ లిమిటెడ్ పరిశ్రమను యాజమాన్యం వెంటనే తెరిపించాలని ఆ కంపెనీ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ గురువారం నిరాహార దీక్ష చేపట్టింది. ఈ సందర్భంగా గ్రామసర్పంచ్ యండపల్లి శేఖర్‌బాబుకు వివిధ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని యూనియన్ నేతలు అందజేశారు. దీనికి ముఖ్య అతిథిగా హాజరైన హైకోర్టు న్యాయవాది నంబూరి శ్రీమన్నారాయణ మాట్లాడుతూ కార్మికులు ఐక్యంగా తమ సమస్యల పరిష్కారం, హక్కుల సాధనకోసం యూనియన్‌ను ఏర్పాటు చేసుకోవడం రాజ్యాంగం వారికి ఇచ్చిన హక్కు అన్నారు. కార్మికులంతా విధులకు హాజరై పనులు చేస్తామంటే యాజమాన్యం అక్రమంగా మూసివేయడం వెనుక ఏదో ప్రయోజనం ఉందని ఆరోపించారు. లేబర్ అనుమతి లేకుండా ఫ్యాక్టరీని మూసి వేయడం వెనుక అంతర్యం ఏమిటని ఆయన ప్రశ్నించారు. యాజమాన్యం స్పందించకపోతే ఉద్యమం ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ జిల్లా ఉపాధ్యక్షుడు నాగేశ్వరరావు, యూనియన్ అధ్యక్షుడు పెందుర్తి వెంకట్రాయుడు, పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మహర్షి, యూనియన్ నాయకులు నాగేశ్వరరావు, సోమరాజు, రాము, సతీశ్, తదితరులు పాల్గొన్నారు.

అద్భుత పథకాలు అందించిన ఘనత మోదీదే

- 2047 నాటికి వికసిత్ భారత్ లక్ష్యం - కాకినాడలో కేంద్రమంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ



కాకినాడ సదస్సులో మాట్లాడుతున్న కేంద్రమంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ

కాకినాడ, జూన్12 (ఆంధ్రజ్యోతి): ఏ దేశంలోనూ అమలు చేయలేని అద్భుత పథకాలను ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలో ఎన్డీఏ ప్రభుత్వం మనదేశంలో అమలు చేసిందని కేంద్ర సహాయ శాఖ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ తెలిపారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం 11 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా కాకినాడలోని పైండా చలమయ్య శ్రీనివాస కల్యాణ మండపంలో గురువారం ఏర్పాటు చేసిన వృత్తినిపుణుల సదస్సుకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. బీజేపీ కాకినాడ జిల్లా అధ్యక్షుడు బిక్కిన విశ్వేశ్వరరావు అధ్యక్షతన సదస్సును కేంద్రమంత్రి జ్యోతిప్రజ్వలనతో ప్రారంభించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ... 2014లో పూర్తి మెజారిటీతో మోదీ నేతృత్వంలో ఎన్డీయే ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందన్నారు. అనంతరం ప్రభుత్వం ఈ 11 ఏళ్లలో చేసిన అభివృద్ధి కార్యక్రమాలను వివరించేలా ఏర్పాటుచేసిన ప్రదర్శనను ప్రారంభించారు. సదస్సులో బీజేపీ నేతలు ఎనిమిరెడ్డి మాలకొండయ్య, వేటుకూరి సూర్యనారాయణ రాజు, సాల గ్రామ లక్ష్మీప్రసన్న, తుమ్మల పద్మజ, రావూరి సుధ, పైడా కృష్ణమోహన్, వెంగమాంబ శ్రీనివాసరావు, కే. భీమశేఖర్, మీడియా కో-ఆర్డినేటర్ తుమ్మల నారాయణరావు(నాని), సింగిలిదేవి సత్తిరాజు, యార్లగడ్డ రామ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

వేర్వేరు ప్రమాదాల్లో ముగ్గురి మృతి

● ఇనుప గెడ విద్యుత్ వైర్లకు తగిలి కూలీ ...
రోడ్డు ప్రమాదంలో వృద్ధుడు...
'గోదావరి'లో గుర్తుతెలియని వ్యక్తి...

నల్లజర్ల, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): నల్లజర్ల మండలం సుబ్రహ్మపాలెంకి చెందిన కొబ్బరి దింపు కార్మికుడు తిప్పనబోయిన శ్రీను (35) గురువారం కొబ్బరికాయలు తీస్తుండగా ఇనుప గెడ విద్యుత్ వైర్లకు తగిలి అక్కడికక్కడే మృతిచెందాడు. వివరాలిలా ఉన్నాయి. శ్రీను పోతవరం శివారులోని రైతు వెల్లంకి కృష్ణ కొబ్బరితోటలో కాయలు తీసేందుకు గురువారం కూలీ పని నిమిత్తం వెళ్లాడు. ఈ క్రమంలో ఇనుప గెడ పక్కనే ఉన్న విద్యుత్ వైర్లపై పడిపోవడంతో మృతిచెందాడు. ఈయనకు భార్య సుధారాణి, ఇద్దరు పిల్లలు ఉన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తాడేపల్లి గూడెం ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఎస్ఐ సత్యనారాయణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. దీంతో గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి.



సంఘటనా స్థలంలో శ్రీను మృతదేహం

బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలని పలువురు గ్రామస్థులు, తదితరులు కోరుతున్నారు.

కొవ్వూరు: గోదావరి నదిలో గుర్తుతెలియని మృతదేహాన్ని గుర్తించినట్టు కొవ్వూరు పట్టణ సీఐ పి. విశ్వం తెలిపారు. పట్టణంలోని భక్తాంజనేయ స్నానఘట్టంలో గురువారం సుమారు 40 నుంచి 45 సంవత్సరాల మగ మృతదేహం తేలుతుందని స్థానికులు పోలీసులకు సమాచారమిచ్చారు. దీంతో సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని స్థానిక జాలర్ల సహకారంతో నది నుంచి బయటకు తీయించారు. పోస్టుమార్టం నిమిత్తం కొవ్వూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడికి సంబంధించి ఎటువంటి వివరాలు తెలియరాలేదు.. ఆచూకీ తెలిసినవారు పట్టణ పోలీస్‌స్టేషన్‌లో గానీ, 9440796622 నెంబర్‌కు గానీ సమాచారం అందించాలని సీఐ తెలిపారు.

రాజోలు: రాజోలులో జరిగిన రోడ్డు ప్రమాదంలో తెన్నేటి నగర్‌కు చెందిన పి.పురుషోత్తం (72) మోటారు సైకిల్ ఢీకొని మృతిచెందినట్టు రాజోలు ఏఎస్ఐ కె.నాగేశ్వరరావు తెలిపారు. గురువారం ఆయన తెలిపిన వివరాల ప్రకారం రాజోలు తెన్నేటి నగర్‌కు చెందిన పురుషోత్తం రాజోలు సెంటర్‌లో ఉన్న కాఫీ షాపుకి వెళతుండగా రాజోలు నుంచి శివకోడు వైపు వెళతున్న మోటారు సైకిల్‌పై వెళుతున్న వ్యక్తి అతివేగంగా సైకిల్‌ను ఢీకొట్టడంతో కిందపడిపోయాడు. దీంతో తలకు బలమైన గాయం కావడంతో వెంటనే స్థానికులు ప్రభుత్వ సామాజిక ఆసుపత్రికి తీసుకువెళ్లారు. అప్పటికే పురుషోత్తం మృతిచెందినట్టు వైద్యులు ధ్రువీకరించారు. ఈయనకు భార్య, కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. భార్య వెంకట సుబ్బలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

'చిరంజీవినీకుమారి గొప్ప మానవతావాది'



సంస్మరణ సభలో పాల్గొని పూలమాలవేసి నివాళులర్పిస్తున్న ప్రముఖులు

కాకినాడ రూరల్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ విద్యావేత్త, ఐడీఎల్ విద్యాసంస్థల కరస్పాండెంట్, కార్యదర్శి డాక్టర్ పాలెపు చిరంజీవినీకుమారి గొప్ప మానవతావాది అని పలువురు కొనియాడారు. గురువారం కాకినాడ జిల్లా కాకినాడ-సామర్లకోట రోడ్డులోని ఐడీఎల్ కళాశాల సెమినార్‌హాల్లో సంస్మరణ సభను నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల పూర్వవిద్యార్థుల సంఘం ప్రతినిధులు, పూర్వ అధ్యాపకులు చిరంజీవినీ కుమారి చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం ఆమెతో గల తమ జీవిత అనుభవాలను, అనుభూతిని, అనుబంధాలను గుర్తుచేసుకున్నారు. సంస్మరణసభను డీవీఎస్ఎన్ మూర్తి (మురళీ) ప్రారంభించగా, జీవీకే వర్మ అధ్యక్షత వహించారు. చిరంజీవినీకుమారి కాంస్య విగ్రహాన్ని కళాశాలలో ప్రతిష్ఠించాలని, అలాగే ఆమె పేరుమీద ఒక అవార్డు ఇవ్వాలని సంతాపసభలో పాల్గొన్న వారు సూచించారు. వీఎస్ఎస్ కిరణ్, జీవీ కృష్ణంరాజు, జి.రమేష్‌కాంత్, ఎంవీ చౌదరి, టి.బసవరాజు, ఎస్‌వీకే వర్మ, వాసు, ఎన్.రామరాజు, కోటగిరి సత్యంబాబు, పద్మావతి, సుబ్బారావు, శ్రీనివాసరావు, సత్తిరాజు, సుబ్బారాయుడు, వరప్రసాద్ పాల్గొన్నారు.

అన్నవరం దేవస్థానంలో క్షేత్రపాలకులకు వెండి మకరతోరణం బహూకరణ

అన్నవరం, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): అన్నవరం సత్యదేవుడి నిత్య కల్యాణం జరిపించే సమయంలో క్షేత్రపాలకులు సీతారాముల ఉత్సవమూర్తులకు వెనుక భాగంలో అలంకరించేందుకు గురువారం వ్రత పురోహితుల్లో కొందరు



వెండి మకరతోరణాన్ని ఈవోకు అందజేస్తున్న పురోహితులు

రూ. మూడు లక్షల విలువ చేసే 2345 గ్రాముల వెండితో తయారు చేయించిన మకరతోరణం ఈవో సుబ్బారావుకు అందజేశారు. అల్లంరాజు శ్రీనివాస్, గుత్తిన రామకృష్ణ, నాగాభట్లరవిశర్మ, ఇతర డ్యూటీసభ్యులు 43 మంది కలిపి వీటిని అందజేశారు ఈవో వారిని అభినందించారు. సత్యదేవుడి సన్నిధిలో పనిచేస్తూ స్వామి నిత్యకల్యాణంలో అవసరమైనవి గుర్తించి దాన్ని విరాళంగా అందజేయడం అభినందనీయమని ఈవో తెలిపారు.

ద్రాక్షారామ భీమేశ్వరస్వామి ఆలయానికి 8 కూలర్లు అందజేత

ద్రాక్షారామ, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): ద్రాక్షారామ భీమేశ్వర స్వామివారి ఆలయానికి హైదరాబాద్‌కు చెందిన అనుమోలు దేవా కుటుంబ సభ్యుల ఆర్థిక సాయంతో రూ.లక్ష విలువ చేసే ఎనిమిది కూలర్లను గురువారం సమకూర్చారు. వీటిని ఆలయ సహాయ కమిషనర్ అల్లు వెంకట దుర్గాభవానీకి అందించారు. ఆలయ అర్చకులు పాల్గొన్నారు.



భీమేశ్వరస్వామి ఆలయంలో కూలర్లు అందజేస్తున్న దృశ్యం

లక్ష్మీనరసింహస్వామి దేవస్థాన సహాయ కమిషనర్‌గా ప్రసాద్



నూతన ఏసీ ఎంకేటీఎన్వీ ప్రసాద్‌కు స్వాగతం పలుకుతున్న అర్చకులు, అధికారులు

అంతర్వేది, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహ స్వామివారి దేవస్థాన సహాయ కమిషనర్‌గా ఎంకేటీవీఎన్వీ ప్రసాద్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. తొలుత ఆయనకు ఆలయ అర్చకులు, అధికారులు ఘనస్వాగతం పలికారు. స్వామివారి దర్శనం అనంతరం వేద పండితులు ఆశీర్వచనం అందించారు. అనంతరం స్వామిఆలయ కార్యాలయంలో ప్రసాద్ నూతన బాధ్యతలు స్వీకరించి అర్చకులు, సిబ్బందిని కలిసి మాట్లాడారు. ఇప్పటి వరకు ఇక్కడ పనిచేసిన వి.సత్యనారాయణ జిల్లా ఏసీగా కొనసాగుతున్నారు.



స్వామి ఆలయంలో బాధ్యతలు స్వీకరిస్తున్న ఏసీ ఎంకేటీఎన్వీ ప్రసాద్

1,268 కిలోల పీడీఎస్ బియ్యం స్వాధీనం



రేషన్ బియ్యంతో పట్టుబడిన వాహనం

రాజానగరం, జూన్ 12(ఆంధ్రజ్యోతి): తణుకు నుంచి జగ్గంపేటకు బొలేరో వాహనంలో అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని సివిల్ సప్లై అధికారులు గురువారం రాజానగరంలో పట్టుకున్నారు. ఈమేరకు ఎంఎస్‌వో గొలుగూరి బాపిరాజు తెలిపిన వివరాలు ప్రకారం... బొలేరో వాహనంలో వివిధ రంగులతో కూడిన 32 ప్లాస్టిక్ సంచుల్లో 1,268 కిలోల బియ్యాన్ని రవాణా చేస్తుండగా పట్టుకున్నామన్నారు. పట్టుబడిన బియ్యం విలువ రూ.58,328 కాగా వాహనం విలువ రూ.1.50 లక్షలు వెరసి రూ.2,08,328గా నిర్ధారించారు. యజమాని జగ్గంపేటకు చెందిన మారిశెట్టి గణేష్, అదే గ్రామానికి చెందిన డ్రైవర్ గట్టెం సత్తిబాబు పీడీఎస్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తున్నారన్నారు. బియ్యంతో పాటు వాహనాన్ని సీజ్ చేసి, నిందితులపై రాజానగరం పోలీసులకు ఫిర్యాదు చేశామన్నారు.

భర్త హత్య కేసులో భార్య, ప్రియుడు అరెస్టు



బిక్కవోలులో విలేకర్లతో మాట్లాడుతున్న డీఎస్పీ విద్య

బిక్కవోలు, జూన్ 12(ఆంధ్రజ్యోతి): తూర్పు గోదావరి జిల్లా బిక్కవోలులో మంగళవారం అర్ధరాత్రి జగనన్న కాలనీలో కెంగం శ్రీనును హత్య చేసిన కేసులో అతని భార్య దేవి, ప్రియుడు జంపా దుర్గారావును గురువారం అరెస్టు చేసినట్టు రాజమహేంద్రవరం ఈస్ట్‌జోన్ డీఎస్పీ బి.విద్య గురువారం రాత్రి బిక్కవోలు పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో తెలిపారు. దేవి, దుర్గారావు మద్యం మత్తులో వున్న శ్రీనును తలపై ప్లాస్టిక్ స్టూల్‌తో బలంగా కొట్టి అతడి షర్ట్‌తో ముక్కు, నోరు నొక్కి ఊపిరి ఆడకుండా చేసి చంపారన్నారు. ఇద్దరూ స్థానిక వీఆర్వో పోతురాజు ఎదుట సరెండర్ అవ్వడంతో సీఐ సుమంత్ వీరిని అదుపులోకి తీసుకుని అనపర్తి కోర్టులో హాజరు పర్చగా రిమాండ్ విధించారన్నారు. సమావేశంలో ఎస్ఐ వి.రవిచంద్రకుమార్ ఉన్నారు.

మహిళా సిబ్బందితో స్వీపర్ అసభ్య ప్రవర్తన

ఉద్యోగిని ఫొటోలు సెల్‌లో చిత్రీకరణ
ప్రతిఘటించడంతో నెట్టేసిన వైనం
కరప పీహెచ్‌సీలో సిబ్బంది ఆందోళన

కరప, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా కరప పీహెచ్‌సీలో స్వీపర్‌గా విధులు నిర్వర్తిస్తున్న రాజాబాబు నిర్వాకంపై అక్కడ పనిచేస్తున్న మహిళా సిబ్బంది ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మూగ, చెవిటి వాడైన రాజాబాబు రెండేళ్లుగా ఈ పీహెచ్‌సీలో పనిచేస్తున్నాడు. విధులు సక్రమంగా నిర్వహించకపోవడంతో పాటు మహిళా సిబ్బంది ఫొటోలు తీస్తూ, వారిని మానసికంగా వేధిస్తూ పైశాచిక ఆనందం పొందుతున్నాడని పలువురు ఆరోపిస్తున్నారు. ఈ క్రమంలో గురువారం విధుల్లో ఉన్న గర్భిణీ అయిన ఒక ఉద్యోగి ఫొటోలను సెల్‌లో చిత్రీకరిస్తుండడంతో ఆమె ప్రతిఘటించింది. దీంతో ఆమెను యూడీసీ సమక్షంలోనే కిందకు నెట్టేయడంతో ఆ మహిళా ఉద్యోగి కన్నీటిపర్యంతమయ్యింది. గతంలో పెద్దాడ పీహెచ్‌సీలో పనిచేసినప్పుడు కూడా అతను ఇలాగే ప్రవర్తించేవాడని, ఎన్నిసార్లు మందలించినా పట్టించుకోకుండా మహిళా సిబ్బంది పట్ల అసభ్యంగా మెలుగుతున్నట్టు తెలుస్తోంది. దీనిపై ఉన్నతాధికారులు స్పందించి బాధ్యుడిపై చర్యలు తీసుకోవాలని పలువురు సిబ్బంది విజ్ఞప్తిచేస్తున్నారు. ఈ వ్యవహారంపై పీహెచ్‌సీ వైద్యాధికారిణి అఫ్రోజ్‌ను వివరణ కోరగా స్వీపర్ రాజాబాబు మహిళా సిబ్బంది ఫొటోలు తీస్తున్నాడని తెలిసి మందలించామన్నారు. దీనిపై డీఎంహెచ్‌వో కార్యాలయంలో ఫిర్యాదు చేయనున్నట్టు తెలిపారు.

శ్రీకామాక్షీ చారిటబుల్ ట్రస్టు ఎన్నిక

అమలాపురం టౌన్, జూన్ 12(ఆంధ్రజ్యోతి): అమలాపురం కూచిమంచి అగ్రహారంలోని శ్రీకామాక్షీ పీఠ మహా సంస్థానానికి చెందిన శ్రీకామాక్షీ దేవి చారిటబుల్ ట్రస్టు వ్యవస్థాపకుడు, పీఠాధిపతి కామేశ మహర్షి ఇటీవల శివైక్యం చెందారు. దాంతో గత ఆదేశాలను అనుసరించి గురువారం శాశ్వత సభ్యులు వక్కలంక వాణిని ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆమెతో పాటు మద్రి దుర్గారావు, మట్టపర్తి సత్యనారాయణ, వీరా నాగేశ్వరరావుతో పాటు పీఠ ముద్రాధికారి ఉప్పులూరి విఘనస రాఖీప్రేమ్‌ను కామేశమహర్షి స్థానంలో నియమించారు. పీఠంలో యథావిధిగా పూజా కార్యక్రమాలు జరుగుతాయన్నారు. విరాళాలు అందిస్తున్న దాతలకు ట్రస్టు తరపున కృతజ్ఞతలు తెలిపారు.

గడ్డి మందు తాగి వ్యక్తి మృతి

గోకవరం, జూన్ 12(ఆంధ్రజ్యోతి): గడ్డి మందు తాగి ఓ వ్యక్తి మృతి చెందాడు. స్థానికుల కథనం ప్రకారం.. గోకవరం మండలం రంపయర్రంపాలెం గ్రామానికి చెందిన సన్నపు నాగేంద్రుడు(53) ఇంటి వద్ద గడ్డి మందు తాగి అపస్మారక స్థితికి చేరుకున్నాడు. విషయాన్ని తెలుసుకున్న కుటుంబసభ్యులు గోకవరం ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లగా అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు ధ్రువీకరించారు. కాగా నాగేంద్రుడికి భార్య, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు.

అవిభక్త కవలల తొలగింపు



చింతూరు, జూన్ 12 (ఆంధ్రజ్యో): తల్లికి ప్రాణాపాయం ఏర్పడే పరిస్థితిని ముందుగా గుర్తించిన వైద్యులు శస్త్ర చికిత్స ద్వారా అవి భక్త కవలలను తొలగించారు. వివరాలిలా ఉన్నాయి... అల్లూరి జిల్లా చింతూరు మం డలం కుమ్మూరుకు చెందిన గర్భవతి వీర మణి దంపతులు ఈ నెల 7న చింతూరు ఏరియా ఆసుపత్రికి సాధారణ పరీక్షల నిమి త్తం వెళ్లారు. పరీక్షించిన గైనకాలజిస్ట్ డాక్టర్ శశికళ వీరమణి గర్భంలో ఉన్న ఆందోళన పరిస్థితిని పసిగట్టారు. అత్యాధునిక స్కానింగ్ నిమిత్తం రేడియాలజిస్ట్‌ని సంప్రదించాలని ఆమెతో పాటు ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కోటిరెడ్డి సూచించారు. దీంతో వీరమణి నిభర్త ప్రసాద్ తెలంగాణ రాష్ట్రం భద్రాచలంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తీసుకెళ్లగా వైద్యులు పరీక్షించి వీరమణి గర్భంలో ఉన్న అవిభక్త కవలలను తొలగించాలని, లేకుంటే తల్లి ప్రాణాలకు ప్రమాదం ఉందని వివరించారు. వీరమణి దంపతుల అభీష్టం మేరకు శస్త్ర ద్వారా అవిభక్త కవలలను తొలగించారు. తల్లి ఆరోగ్యంగా ఉందని వైద్యులు చెప్పారు.

పరిశోధనలు అత్యంత అవసరం

» ఎన్టీఆర్ హెల్త్ యూనివర్శిటీ వీసీ, కార్డియాలజీ నిపుణుడు డాక్టర్ చంద్రశేఖర్
» కాకినాడ రంగరాయలో అట్టహాసంగా ఎరెవ్నా 4.0
» సదస్సుకు 600 మంది వైద్య విద్యార్థులు



జ్యోతిప్రజ్వలన చేస్తున్న వీసీ డాక్టర్ చంద్రశేఖర్

జీజీహెచ్ (కాకినాడ), జూన్ 12 (ఆంధ్రజ్యోతి): గతంలోలా కేవలం నేర్చుకోవడంతో సరిపెడదామంటే వైద్యవిద్యలో రాణించలేమని, పరిశోధన అత్యంత ఆవశ్యకమని వివరించారు. డాక్టర్ ఎన్టీఆర్ హెల్త్ యూనివర్శిటీ వైస్ ఛాన్సలర్, ప్రముఖ కార్డియాలజీ నిపుణుడు డాక్టర్ చంద్రశేఖర్ అన్నారు. కాకినాడ ఆర్ఎంసీ, ఫార్మకాలజీ విభాగంలో ఎరెవ్నా 4.0 గురువారం అట్టహాసంగా ప్రారంభమైంది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన డాక్టర్ చంద్రశేఖర్ జ్యోతిప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆర్ఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.విష్ణువర్ధన్ ఆధ్వర్యం లో నిర్వహించిన ఈ కార్యక్రమానికి సుమారు 600 మంది వైద్య విద్యార్థులు హాజరయ్యారు. అకడమిక్ డీఎంఈ డాక్టర్ రఘునందన్ విశిష్ట అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ చంద్రశేఖర్ మాట్లాడుతూ ఎరెవ్నా సదస్సు వైద్య విద్యార్థుల భవితను బంగారుమయం చేస్తుందన్నారు. వైద్య ప్రక్రియలో నూతన పోకడలు ఎరెవ్నా సదస్సు ద్వారా విద్యార్థులు నేర్చుకోవచ్చని అభిప్రాయపడ్డారు. విద్యా వ్యవస్థ పూర్తిగా ఆధునికమైందని చంద్రశేఖర్ వ్యాఖ్యానించారు. డాక్టర్ రఘునందన్ మాట్లాడుతూ వైద్య రంగంలో వస్తున్న కొత్త పోకడలను అనుసరించడం ద్వారా వైద్యులుగా మరింత రాణించే అవకాశాలు మెండుగా ఉంటాయన్నారు. దేశ, విదేశాల్లో భారతీయ వైద్యులకు ఎనలేని డిమాండ్ ఉందని, ప్రభుత్వ రంగాల్లో కూడా స్థిరపడేందుకు అవకాశాలు ఇటీవల పెరిగాయన్నారు. అనంతరం వైద్య విద్యార్థులు వివిధ అంశాలపై 14 వర్క్‌షాపులు నిర్వహించారు. కార్యక్రమంలో జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఎస్.లావణ్యకుమారి,ఆర్ఎంసీ వైస్ ప్రిన్సిపాళ్లు డాక్టర్ శశి, డాక్టర్ ఉమామహేశ్వరరావు, జీజీహెచ్ డిప్యూటీ సూపరింటెండెంట్లు డాక్టర్ ఎంపీఆర్ విఠల్, డాక్టర్ పద్మనాభన్ శ్రీనివాసన్, వివిధ విభాగాల హెచ్‌వోడీలు పాల్గొన్నారు.

వైద్య విద్యార్థుల మృతికి సంతాపం

అహ్మదాబాద్‌లో జరిగిన విమాన ప్రమాదంలో సుమారు 20 మందికి పైగా వైద్య విద్యార్థులు ప్రాణాలు కోల్పోయినట్టు నిర్ధారణ కావడంతో వైద్య విద్యార్థులంతా దిగ్భ్రాంతికి గురయ్యారు. ఈ నేపథ్యంలో కాకినాడలో ఎరెవ్నా సదస్సుకు హాజరైన 600 మంది ఆర్ఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.విష్ణువర్ధన్ ఆధ్వర్యంలో కొవ్వొత్తులు వెలిగించి శ్రద్ధాంజలి ఘటించారు.

నర్సుల బదిలీల ప్రక్రియలో వివాదం

» ఈసీ మెంబర్లుగా లేని ఇద్దరికి బదిలీ నుంచి మినహాయింపు కోరిన జిల్లా నర్సింగ్ అసోసియేషన్
» కలెక్టర్, ఆర్డీలను తప్పుదోవ పట్టించారంటూ ఆరోపణలు
» విజిలెన్స్‌కు చేరిన వివాదం

జీజీహెచ్ (కాకినాడ), జూన్ 12 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా నర్సింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వివాదం చోటుచేసుకుంది. నర్సుల బదిలీలలో మాయాజాలానికి అగ్రనాయకత్వం అడ్డదారులు తొక్కిందని ఆరోపణలు వినబడుతున్నాయి. వివరాల్లోకి వెళితే.. తాజా నర్సింగ్ జిల్లా అసోసియేషన్ గత ఏడాది నవంబర్‌లో ఎన్నికల ద్వారా ఏర్పడింది. ఈ ఎన్నికల్లో మొత్తం 9 మంది ఎన్నికయ్యారు. వీరిలో ఐదుగురు ఎగ్జిక్యూటివ్ మెంబర్లున్నారు. అయితే ప్రభుత్వం ప్రస్తుతం అన్ని ప్రభుత్వ శాఖలకు బదిలీల ఉత్తర్వులు ఇచ్చింది. ఈ క్రమంలోనే సంఘ నాయకత్వానికి షరతుల ద్వారా మినహాయింపులు ఇచ్చింది. ఈ నేపథ్యంలో సంఘ కార్యవర్గానికి గిరాకీ పెరిగింది. జిల్లా నర్సింగ్ అసోసియేషన్ కూడా ఇందుకు ఏ మాత్రం తీసిపోలేదు. కొద్ది రోజుల క్రితం ఆ సంఘ నాయకులు కలెక్టర్ షాన్‌మోహన్ ద్వారా ఆర్డీ డాక్టర్ పద్మశశిధర్‌కు సాధారణ బదిలీల్లో భాగంగా అన్ని శాఖలు చేస్తున్నట్టే తమ సంఘ నాయకుల జాబితాను పంపారు. ఆఫీస్ బేరర్ల హోదాలో ఆ జాబితాలో ఉన్న ఇద్దరు ఈసీ మెంబర్లకు బదిలీ నుంచి మినహాయింపు ఇవ్వాలని విన్నవించారు. వీరు కోరిన ఆ ఇద్దరు అసలు ఈసీ మెంబర్లే కాదు. వారు కనీసం ఎన్నికల్లో కూడా పోటీ చేయలేదు. గొల్లపల్లి సుశీలా రాణి, మందపల్లి నీలమణి అనే కాకినాడ జీజీహెచ్‌లో పనిచేస్తున్న ఇద్దరు స్టాఫ్ నర్సులు పేర్లను ఈ జాబితాలో చేర్చి కలెక్టర్, ఆర్డీలను తప్పుదోవ పట్టించారనే ఆరోపణలు ఉన్నాయి. వారి స్థానంలో నిజానికి ఎన్నికైన వారు మచ్చా సుజాత, కె.దేవి అనే ఇద్దరు ఈసీ మెంబర్లు అయితే కె.దేవిని రాష్ట్ర ఈసీ మెంబర్‌గా చూపిస్తూ విన్నతిపత్రంపై పెన్‌తో రాసి రాష్ట్ర పరిధికి నెట్టేశారు. అలాగే ఎన్నికల్లో ఎన్నికైన మరో ఈసీ మెంబర్ మచ్చా సుజాత పేరు అసలు ఈ జాబితాలో లేనేలేదు. ఈ విషయం పై అప్పుడు ఎన్నికలు నిర్వహించిన అధికారులను వివరణ కోరగా ఈసీ మెంబర్ల హోదాలో సుశీలారాణి, నీలమణి అనేవారి పేర్లు లేవని తేల్చారు. ఈ వివాదం కాస్తా విజిలెన్స్ అధికారులకు చేరింది.

అప్పుల బాధలు తాళలేక లారీ ఓనర్ ఆత్మహత్య

పురుగులు మందు తాగి బలవన్మరణం
చికిత్స పొందుతూ మృతి



మణికంఠ(ఫైల్)

కాకినాడ క్రైం, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): కిరాయిలు లేకపోవడంతో జీవనోపాధిని నెట్టుకు రావడం కష్టంగా మారి ఓ లారీ ఓనర్ ఆత్మహత్యకు పాల్పడ్డాడు. వివరాలిలా ఉన్నాయి. కాకినాడ, సూర్యనారాయణపురానికి చెందిన లకమన వీర మణికంఠ (35) కొంతకాలం లారీలపై పని చేస్తూ ఆ అనుభవంతో ఏడాది క్రితం సొంతగా మూడు సెకెండ్ హ్యాండ్ లారీలను ఫైనాన్స్‌లో వాయిదాల పద్ధతిలో కొనుగోలు చేశాడు. ఈ క్రమంలో కాకినాడ పోర్ట్ సహా వివిధ ప్రాంతాలకు లారీలు తిప్పేవాడు. అయితే కొంతకాలంగా పోర్ట్ ప్రాంతంలో వివాదాలు అలుముకోవడంతో ఎగుమతి, దిగుమతులకు గండి పడి లారీల వ్యాపారం ఘననీయం గా తగ్గింది. దీంతో మణికంఠ అప్పులు పాలయ్యాడు. ఒక పక్క లారీలకు సంబంధించిన వాయిదాలు కట్టలేకపోవడంతో గతవారంలో సంతచెరువు సమీపంలో ఉన్న ఫైనాన్స్ కంపెనీ రికవరీ ఏజెంట్లు వచ్చి మూడు లారీలను పట్టుకుపోయారు. దీంతో తీవ్ర మనస్తాపానికి గురైన వీరమణికంఠ బుధవారం రాత్రి పోర్ట్ రైల్వేస్టేషన్ సమీపంలో పురుగులు మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. అనంతరం స్థానికులు గమనించి జీజీహెచ్‌కు తరలించగా చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

20లోగా ఈకేవైసీ చేయించుకోవాలి

కాట్రేనికోన, జూన్ 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని అర్హులైన రైతులు అన్నదాత సుఖీభవ లబ్ధి కోసం ఈనెల 20వ తేదీలోగా బయోమెట్రిక్ ద్వారా ఈకేవైసీ చేయించుకోవాలని వ్యవసాయాధికారి కె.ప్రవీణ్ తెలిపారు. రైతులందరూ తమ ఆధార్ కార్డుతో రైతు సేవా కేంద్రాలకు వెళ్లి ఈకేవైసీ చేయించుకోవాలన్నారు.



ముమ్మిడివరంలో కేక్ కట్‌చేసి సంబరాలు జరుపుకుంటున్న కూటమి నాయకులు

ఏడాదిలో ఎన్నో చేశాం

- ఎమ్మెల్యే దేవ వరప్రసాద్
- కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్న నాయకులు

మలికిపురం, జూన్ 12(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది గడిచిన సందర్భంగా మలికిపురం గాంధీబొమ్మల సెంటర్‌లో కూటమి నాయకుల ఆధ్వర్యంలో రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ కేక్ కట్‌చేసి సంబరాలు జరిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి పాలన అనుకున్న దానికంటే అద్భుతంగా జరుగుతుందన్నారు. రాష్ట్రం అభివృద్ధి పథంలో నడుస్తుందని, అన్నివర్గాలకు అద్భుత పాలన అందిస్తున్నామన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన సూపర్-6 పథకాల్లో ఇప్పటికే పలు అంశాలను అమలు చేస్తున్నట్టు చెప్పారు. కేంద్ర ప్రభుత్వ సహకారంతో విశాఖ ఉక్కును కాపాడుకున్నామని, విశాఖ రైల్వే జోన్‌ను సాధించుకోగలిగామన్నారు. ప్రతీ ఇంటికీ తాగునీరు, నాణ్యమైన విద్యుత్ అందిస్తున్నామన్నారు. చాలా గ్రామాల్లో రోడ్ల నిర్మాణం పూర్తి చేశామని, మిగిలిన రోడ్లను కూడా త్వరలో పూర్తి చేస్తామన్నారు. చంద్రబాబు నాయుడు, పవన్‌కల్యాణ్, మోదీల కలయికతో రాష్ట్రానికి స్వర్ణయుగం రాబోతుందని అన్నారు. ఎమ్మెల్యే కేక్‌ను కట్‌చేయగా అభిమానులు బాణసంచా కాల్చారు. కార్యక్రమంలో ప్రాజెక్టు కమిటీ చైర్మన్ గుబ్బల శ్రీనివాస్, మండల పార్టీ అధ్యక్షుడు అడబాల యుగంధర్, ముదునూరి చినబాబు, గుండుబోగుల పెద్దకాపు, భూపతిరాజు సాయిబాబురాజు, బత్తుల రాము, చాగంటి స్వామి, ముప్పర్తి నాని, అడబాల సాయిబాబు, గుబ్బల ఫణి, సూరిశెట్టి శ్రీనివాస్, కాకి లక్ష్మణ్, తాడి సత్యనారాయణ, కేతా శ్రీను పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు సన్మానం

కూటమి పభ్రుత్వం ఏర్పడి ఏడాది పాలన గడిచిన సందర్భంగా తెలుగుదేశం పార్టీ నాయకులు, ప్రాజెక్టు కమిటీ చైర్మన్ గుబ్బల శ్రీనివాస్ రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్‌ను గురువారం దుశ్శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో చాగంటి స్వామి, ముప్పర్తి నాని, గుబ్బల ఫణి పాల్గొన్నారు.

ముమ్మిడివరంలో సంబరాలు

ముమ్మిడివరం: రాష్ట్ర అభివృద్ధికి నిధులు సమీకరిస్తూ ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీల మేరకు సూపర్-6 పథకాలను అమలు చేస్తూ కూటమి ప్రభుత్వ పాలన ముందుకు సాగుతుందని పలువురు వక్తలు పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వపాలన ఏడాది పూర్తయిన సందర్భంగా ముమ్మిడివరం మండలంలోని టీడీపీ కార్యాలయంలో సుపరిపాలన-స్వర్ణాంధ్రప్రదేశ్ పేరిట గురువారం సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా అర్థాని శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో కేక్‌ను కట్‌చేసి కూటమి నాయకులు, కార్యకర్తలకు పంచారు. రాష్ట్ర కార్యదర్శి గుత్తుల సాయి మాట్లాడుతూ సంవత్సర పరిపాలనలో రాష్ట్రాన్ని అభివృద్ధి చేసేందుకు సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, మంత్రి నారా లోకేశ్‌లు విశేష కృషి చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్ చెల్లి అశోక్, నాయకులు గొలకోటి దొరబాబు, పొద్దోకు నారాయణరావు, దొమ్మేటి రమణకుమార్, గుద్దటి జమి, గొల్లపల్లి ధర్మారావు, పిల్లి నాగరాజు, నిమ్మకాయల చిన్నా, చిక్కాల అంజిబాబు, దాట్ల బాబు, గొల్లపల్లి గోపి, యాళ్ల ఉదయ్, విళ్ల వీరాస్వామినాయుడు, పలువురు పాల్గొన్నారు.

సుపరిపాలన అందిస్తున్న ప్రభుత్వం

మామిడికుదురు: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ద్వారా సుపరిపాలన జరుగుతుందని జడ్పీ మాజీ చైర్మన్ నామన రాంబాబు పేర్కొన్నారు. గురువారం మామిడికుదురులో సంబరాలు చేశారు. స్థానిక బస్టాండు కూడలిలో కేక్ కట్‌చేసి అభిమానులకు పంచారు. ఈ సందర్భంగా జడ్పీ మాజీ చైర్మన్ నామన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వ హయాంలో అనేక అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు సంవత్సర కాలంలో జరిగాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో టీడీపీ, జనసేన, బీజేపీ మండలశాఖ అధ్యక్షులు మొల్లేటి శ్రీనివాస్, జాలెం శ్రీనివాసరాజా, బైరిశెట్టి దుర్గారామకృష్ణ, ఏఎంసీ చైర్మన్ పెనుమాల లక్ష్మి, సర్పంచ్ అడబాల తాతకాపు, నాయకులు బోనం బాబు, సూదా బాబ్జి, ఈలి శ్రీనివాస్, కడలి నూకరాజు, వర్థినేని బాబ్జి, మల్లాడి విష్ణు, గంధం భాస్కర్, తుండూరి బుజ్జి, సాపే ఏకాదశి, పార్టీ నాయకులు పాల్గొన్నారు.



మామిడికుదురులో కేక్ కట్‌చేసి సంబరాలు చేసుకుంటున్న కూటమి నాయకులు

కూటమి సంబరాలు

అయినవిల్లి: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తయిన సందర్భంగా టీడీపీ మండలశాఖ అధ్యక్షుడు, ఏఎంసీ చైర్మన్ చిట్టూరి శ్రీనివాస్ ఆధ్వర్యంలో అయినవిల్లిలో గురువారం విజయోత్సవ సంబరాలు నిర్వహించారు. రాష్ట్ర కార్యదర్శి మద్దాల సుబ్బారావు, సర్పంచ్ జయసావిత్రి, ప్రధాన కార్యదర్శి కుడుపూడి బుజ్జి, తోటకూర నాగజోగివర్మ, పెంద్ర రమేష్, మద్దాల రాజా, మట్టపర్తి రాజేశ్వరరావు, బిక్కిన బాబి, గెల్లా అశోక్ పాల్గొని కేక్ కట్ చేశారు.

మురమళ్ళలో నాయకుల సంబరాలు

ఐ.పోలవరం: కూటమి ప్రభుత్వం ఏడాది పాలనలో జరిగిన అభివృద్ధి, సంక్షేమంపై గురువారం మురమళ్ళలో నాయకులు సంబరాలు జరుపుకున్నారు. కేక్ కట్‌చేసి ఆనందంగా పంచుకున్నారు. మాజీ ఎమ్మెల్యే చెల్లి వివేకానంద, టీడీపీ మండలాధ్యక్షుడు రాయపురెడ్డి నీలకంఠేశ్వరరావు, క్లస్టర్ ఇన్‌చార్జి సాగిరాజు సూరిబాబురాజు, తెలుగు యువత అధ్యక్షుడు కాకర్లపూడి రాజేష్, సాక సీతాదేవి, సాగిరాజు వాసురాజు, జనసేన నాయకులు గుద్దటి విజయ్, పెమ్మారెడ్డి సత్యనారాయణ పాల్గొన్నారు.



ఏడాది పాలనపై మురమళ్ళలో కేక్ కట్ చేస్తున్న కూటమి నాయకులు, అయినవిల్లిలో కూటమి సంబరాల్లో నాయకులు

నియోజకవర్గ ప్రజలకు రుణపడి ఉంటాను

- ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ

పి.గన్నవరం, జూన్ 12(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో సుపరిపాలన మొదలై ఏడాది పూర్తయిందని ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ అన్నారు. నాకు నియోజకవర్గంలో స్థానం కల్పించి ఎమ్మెల్యేగా నిలిబెట్టిన నియోజకవర్గ ప్రజానీకానికి ఎల్లప్పుడూ రుణపడి ఉంటానని ఆయన అన్నారు. ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్‌లకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు తెలిపారు. పి.గన్నవరం జనసేన క్యాంపు కార్యాలయంలో గురువారం జరిగిన విజయోత్సవ వేడుకల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్‌లు రాష్ట్రాభివృద్ధికి ఒక విజన్‌తో ముందుకు వెళుతున్నారన్నారు. రాబోయే రోజుల్లో రాజధానితో పాటు జిల్లాలు తద్వారా నియోజకవర్గాలు అభివృద్ధికి బాటపడతాయని చెప్పారు. నియోజకవర్గంలో దీర్ఘకాలిక సమస్యలైన అప్పనపల్లి ఎత్తిపోతల పథకం, కాజ్‌వేలకు నిధులు మంజూరయ్యాయని త్వరలోనే పనులు ప్రారంభించే దిశగా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. అనంతరం నియోజకవర్గ టీడీపీ కో-ఆర్డినేషన్ కమిటీ కన్వీనర్ నామన రాంబాబుతో కలిసి ఎమ్మెల్యే కట్‌చేశారు. అదేవిధంగా అయినవిల్లి మండలం క్రాప గ్రామానికి చెందిన పలువురిని పార్టీ కండువాలనువేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఎంపీపీ గనిశెట్టి నాగలక్ష్మి, చిట్టూరి శ్రీనివాస్, పెనుమాల లక్ష్మి, మద్దాల సుబ్రహ్మణ్వేశ్వరావు, చొల్లంగి సత్యనారాయణమూర్తి, వెంకటేశ్వరావు, బొంతు పెదబాబు, సత్యనారాయణ పాల్గొన్నారు.



ఆర్జేసీ త్రినాథరావుకు అభినందనలు తెలుపుతున్న ఈవో లక్ష్మీనారాయణ

ఆర్జేసీని కలిసిన ఈవో లక్ష్మీనారాయణ

ఐ.పోలవరం, జూన్ 12(ఆంధ్రజ్యోతి): దేవదాయశాఖ రీజనల్ జాయింట్ కమిషనర్ వి.త్రినాధరావును మురమళ్ళ వీరేశ్వరస్వామి ఆలయ ఈవో మాచిరాజు లక్ష్మీనారాయణ కలిశారు. ఆర్జేసీగా త్రినాధరావు బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా ఆయనకు అభినందనలు తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఉప్పలగుప్తం, జూన్ 12(ఆంధ్రజ్యోతి): ఉప్పలగుప్తం విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో ఈనెల 13న న్యూఫీడర్ ఆర్డీఎస్ఎస్ పనులు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. ఈ కారణంగా ఉప్పలగుప్తం, పేరాయిచెరువు, జగ్గరాజుపేట, గొల్లవిల్లి, వాడపర్రు, కూనవరం, కిత్తనచెరువు, చీకట్లపాలెం, సన్నవిల్లి, సూదాపాలెం, భట్టుపాలెం, నంగవరం, భీమనపల్లి, సింగరాయపాలెం, విలసవిల్లి, మునిపల్లి, పెదగాడవిల్లి, చినగాడవిల్లి, వానపల్లిపాలెం, ఎన్.కొత్తపల్లి, రాఘవులపేట గ్రామాలకు ఉదయం 10నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు అమలాపురం ట్రాన్స్‌కో ఈఈ కె.రాంబాబు తెలిపారు.

కాట్రేనికోన: శుక్రవారం కాట్రేనికోన, చెయ్యేరు విద్యుత్ సబ్‌స్టేషన్ల పరిధిలో చెట్ల ఆకులు తొలగింపు, లైన్ల నిర్వహణ పనుల నిమిత్తం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు అమలాపురం ట్రాన్స్‌కో ఈఈ కె.రాంబాబు తెలిపారు. ఈ కారణంగా కాట్రేనికోన, వేట్లపాలెం, జీకే పొర, చిర్రయానాం, బలుసుతిప్ప, కొప్పిగుంట, పల్లంకుర్రు, కందికుప్ప, నడవపల్లి, గెద్దనపల్లి, దొంతికుర్రు, బంటుమిల్లి, ఊప్పాడి, పి.లక్ష్మీవాడ, పెనుమెల్ల గ్రామాలకు సరఫరా ఉండదన్నారు.

టీడీపీ నాయకుడికి ఎమ్మెల్యే పరామర్శ

ఉప్పలగుప్తం, జూన్ 12(ఆంధ్రజ్యోతి): ఎన్.కొత్తపల్లికి చెందిన సీనియర్ టీడీపీ నాయకుడు, మాజీ మునసబు ఈదరపల్లి సూర్యనారాయణరాజును గురువారం అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు పరామర్శించారు. సూర్యనారాయణరాజు కోడలు సీతాదేవి అనారోగ్యంతో మృతి చెందారు. మృతురాలి కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే పరామర్శించి సానుభూతి తెలిపారు. పరామర్శించిన వారిలో టీడీపీ వాణిజ్య విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు దేశంశెట్టి వెంకటలక్ష్మీనారాయణ, పార్టీ మండలాధ్యక్షుడు అరిగెల నానాజీ, సీఎస్ఎం, ఎంఎస్ఎస్ కళాశాలల కరస్పాండెంట్, కార్యదర్శి చిక్కం వెంకటేశ్వరరాజేంద్రప్రసాద్, ప్రిన్సిపాల్ కంచుమర్తి బాలాజీ తదితరులున్నారు

సెన్‌టాక్ లేటారల్ ఎంట్రీకి దరఖాస్తుల ఆహ్వానం

యానాం, జూన్ 12(ఆంధ్రజ్యోతి): పుదుచ్చేరిలోని వివిధ కళాశాలలో ఇంజనీరింగ్ కోర్సులకు సెన్‌టాక్ (సెంట్రలైజ్డ్ అడ్మిషన్ కమిటీ) ఆధ్వర్యంలో లేటారల్ ఎంట్రీ ద్వారా ఆన్‌లైన్ దరఖాస్తులు స్వీకరించనున్నట్లు కోఆర్డినేటర్ ప్రకటనలో తెలిపారు. 2025-26 విద్యా సంవత్సరానికిగాను ఇంజనీరింగ్ కోర్సుల్లో(నేరుగా ద్వితీయ సంవత్సరం) ప్రవేశానికి అసక్తిగల అభ్యర్థుల నుంచి దరఖాస్తులను స్వీకరిస్తున్నారు. ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులను ఈనెల 26వ తేదీలోగా చేసుకోవాలన్నారు. వివరాలకు సెంటాక్ వెబ్‌సైట్ నుంచి పొందవచ్చన్నారు.

ఘనంగా బూరుగులమ్మ జాతర

అంబాజీపేట, జూన్ 12(ఆంధ్రజ్యోతి): పుల్లేటికుర్రు గ్రామదేవత శ్రీ బూరుగులమ్మ తల్లి అమ్మవారి జాతర గురువారం రాత్రి ఘనంగా నిర్వహించారు. అమ్మవారి జాతరలో గరగనృత్యాలు, కోయిడ్యాన్సులు, సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటుచేశారు. శుక్రవారం అమ్మవారి ఆల యంవద్ద తీర్థం జరుగుతుందని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

సువర్ణాక్షరాలతో లిఖించదగ్గ మోదీ పాలన

- అనపర్తి ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి

అమలాపురం రూరల్, జూన్ 12(ఆంధ్రజ్యోతి): దేశ చరిత్రలో ప్రధాని మోదీ పాలన సువర్ణాక్షరాలతో లిఖించదగినదని అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి పేర్కొన్నారు. ప్రపంచంలోనే అత్యున్నత ఆర్థిక వ్యవస్థల్లో భారతదేశాన్ని నాల్గో స్థానంలో నిలిపిన ఘనత ఆయనదేనన్నారు. వాగ్దానాలతో కాకుండా పనితీరుతో పాలన అంటే ఏమిటో మోదీ చూపించారన్నారు. భట్లపాలెం బీవీసీ ఇంజనీరింగ్ కళాశాలలో గురువారం వృత్తి నిపుణుల సదస్సు బీజేపీ జిల్లాశాఖ అధ్యక్షుడు అడబాల సత్యనారాయణ అధ్యక్షతన నిర్వహించారు. దేశంలో సుపరిపాలన-పేదల సంక్షేమానికి పదకొండేళ్ల కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన సదస్సుకు రామకృష్ణారెడ్డితో పాటు బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి పెద్దిరెడ్డి రవికిరణ్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు మానేపల్లి అయ్యాజీవేమా, కిసాన్‌మోర్చా జాతీయ కార్యవర్గ సభ్యుడు నల్లా పవన్‌కుమార్, జిల్లా పూర్వ అధ్యక్షుడు యాళ్ల దొరబాబు పాల్గొని అనేక అంశాలపై ప్రసంగించారు. కోనసీమ ప్రజల చిరకాల వాంఛ అయిన రైల్వేలైన్ పూర్తిచేసే విషయాన్ని మోదీ దృష్టికి తీసుకువెళతామని పేర్కొన్నారు. కార్మికులకు ఈ శ్రమ్ కార్డులు ప్రవేశ పెట్టడంతో పాటు బీమా సదుపాయాన్ని కల్పించారని రైతులకు కిసాన్ సమ్మాన్ నిధి, పసల్‌బీమా యోజన వంటి పథకాలు అమలు చేస్తున్నారని వివరించారు. సమావేశంలో నాయకులు పాలూరి సత్యానందం అరిగెల తేజవెంకటేష్, ఇళ్ల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



భట్లపాలెం బీవీసీలో వృత్తి నిపుణుల సదస్సులో మాట్లాడుతున్న అనపర్తి ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి

23న యానాం రానున్న స్లమ్ క్లియరెన్స్ అధికారులు

యానాం, జూన్ 12(ఆంధ్రజ్యోతి): యానాం నియోజకవర్గంలో ప్రధానమంత్రి ఆవాజ్‌యోజన 2.0పథకం ద్వారా అర్హులైన లబ్ధిదారులకు రూ.5లక్షలు ఉచిత గృహ నిర్మాణ సహాయన్ని అందించేందుకు యానాం రానున్నారని పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు తెలిపారు. తొలివిడతలో 100 మంది లబ్ధిదారులకు ఇవ్వనున్నారు. ఈమేరకు పుదుచ్చేరిలోని స్లమ్ క్లియరెన్స్ అధికారులతో మల్లాడి సమావేశమయ్యారు. ఇప్పటికే దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులకు సంబంధించి వాటిని క్షేత్రస్థాయిలో పరిశీలించేందుకు ఈనెల 23న బృందం యానాం రానున్నట్లు తెలిపారు. కూలిపోయే స్థితిలో ఉన్న ఇళ్లను పునర్ నిర్మించడానికి మరో రెండు రోజుల్లో దరఖాస్తులు ఇస్తామన్నారు.

ఆర్‌డబ్ల్యుఎస్ కుళాయిల నుంచి మురుగునీరు

అంతర్వేది, జూన్ 12(ఆంధ్రజ్యోతి): సఖినేటిపల్లి మండలంలో అంతర్వేదిపాలెం రామేశ్వరం, మంచినీటి చెరువు ద్వారా ప్రజలకు తాగునీరు అందిస్తారు. వేసవి కాలంలో అంతర్వేదిపాలెం మంచినీటి చెరువులో నీరు అడుగంటిపోగా గుడిమెళ్లంక నుంచి తాగునీరు సరఫరా అవుతుంది. రామేశ్వరం మంచినీటి చెరువు నుంచి సరఫరా అవుతున్న తాగునీరు ఎప్పుడూ మురుగుగానే రావడంతో గ్రామస్థుల నుంచి తీవ్ర విమర్శలు వినిపిస్తున్నాయి. వర్షాకాలంలోను, శీతాకాలంలోను, వేసవి కాలంలోను రామేశ్వర ఆర్‌డబ్ల్యుఎస్ మంచినీటి పథకం నుంచి మురుగునీరు వస్తోందని ప్రజలు గగ్గోలు పెడుతున్నారు. దీనిపై ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులు దృష్టి సారించాలని ప్రజలు ముక్తకంఠంతో కోరుతున్నారు.

ఏఎంసీ ఉద్యోగికి సత్కారం

అంబాజీపేట, జూన్ 12(ఆంధ్రజ్యోతి): అంబాజీపేట వ్యవసాయ మార్కెట్ కమిటీలో ఆరేళ్ల పాటు జూనియర్ మార్కెట్ సూపర్‌వైజర్‌గా పనిచేసి బదలీపై వెళుతున్న ఎంవీఎస్‌కే మల్లికార్జునరావును కార్యదర్శి ఐ.రమేష్ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా మల్లికార్జునరావు ఎంతో కష్టపడి పనిచేశారని తెలిపారు. కార్యక్రమంలో స్థానిక మార్కెట్ కమిటీ సూపర్‌వైజర్లు బీఎస్ఎస్ కుమార్, పి.పరశురాముడు, సిబ్బంది పాల్గొన్నారు.

జేఈఈ అడ్వాన్స్‌లో సుకుమార్‌కు 153వ ర్యాంకు

అమలాపురం టౌన్, జూన్ 12(ఆంధ్రజ్యోతి): అమలాపురం శ్రీరామనగర్ కాలనీకి చెందిన పరమట సుకుమార్‌కు ఇటీవల విడుదలచేసిన జేఈఈ అడ్వాన్స్‌లో ఆలిండియా ఓపెన్ కేటగిరీలో 153వ ర్యాంకు సాధించాడు. తండ్రి ప్రసాదరావు వ్యవసాయ కూలీ కాగా తల్లి గృహిణి. అహర్నిశలు శ్రమించి బిడ్డను ఉన్నత స్థాయికి తీసుకువచ్చేందుకు వారు ఎంతో శ్రమించారు. అమలాపురం ప్రభుత్వ బాలుర ఉన్నతపాఠశాలలో పదో తరగతి వరకు సుకుమార్ చదువుకున్నాడు. 153వ ర్యాంకు సాధించిన సుకుమార్‌ను ది అమలాపురం డిగ్రీ కళాశాల డైరెక్టర్ ఎం.కిరణ్‌కుమార్, ఓపీఆర్ఎస్ నంది వరహాలబాబు, నంది సంపత్‌రావు ప్రత్యేకంగా అభినందించి సత్కరించారు.



సుకుమార్‌ను అభినందిస్తున్న కిరణ్‌కుమార్

యోగాపై అవగాహన కల్పిస్తూ పోటీలు

అమలాపురం టౌన్, జూన్ 12(ఆంధ్రజ్యోతి): యోగాంధ్ర మాసోత్సవాల్లో భాగంగా గురువారం అన్నివర్గాల వారికి పలు పోటీలు నిర్వహించారు. కలెక్టరేట్‌లోని గోదావరి భవన్‌లో యోగా విశిష్టతను వివరిస్తూ విద్యార్థులతోపాటు యువతకు చిత్రలేఖనంపై పోటీ నిర్వహించారు. యోగా షెడ్యూల్ ప్రకారం ప్రతీరోజు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తామని ఆయుష్ వైద్యాధికారిణి డాక్టర్ కె.విజయకుమారి తెలిపారు. ఈనెల 13, 14 తేదీల్లో గోదావరి భవన్‌లో యోగా స్కిట్, యోగా క్విజ్, యోగా పోస్టర్, యోగా షార్ట్‌ఫిల్మ్, యోగా ఫొటోగ్రఫీ పోటీలు స్త్రీ, పురుష విభాగాల్లో నిర్వహిస్తామని తెలిపారు. ఈ అవకాశాన్ని యోగా పట్ల ఆసక్తిగల యువతీ యువకులు సద్వినియోగం చేసుకుని విజేతలుగా నిలవాలని తెలిపారు.

రమ్యకు షైనింగ్ స్టార్స్ పురస్కారం

ఉప్పలగుప్తం, జూన్ 12(ఆంధ్రజ్యోతి): గొల్లవిల్లి సీఎస్ఎం జూనియర్ కళాశాలకు చెందిన ఇంటర్ ద్వితీయ విద్యార్థిని గోసంగి రమ్యకు రాష్ట్ర ప్రభుత్వ పురస్కారం లభించింది. జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ చేతుల మీదుగా రమ్య షైనింగ్ స్టార్స్ అవార్డు అందుకుంది. ఈ సందర్భంగా గురువారం కళాశాలలో అభినందన కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో కళాశాల అధ్యక్షుడు చిక్కం ఉమామహేశ్వరరావు, ఉపాధ్యక్షుడు నిమ్మకాయల సూర్యనారాయణమూర్తి, సెక్రటరీ, కరస్పాండెంట్ చిక్కం వేంకటేశ్వరరాజేంద్రప్రసాద్, కోశాధికారి మోటూరి సుబ్రహ్మణ్యం, ప్రిన్సిపాల్ కంచుమర్తి బాలాజీ, వైస్ ప్రిన్సిపాల్ తోకల దుర్గాఈశ్వరరావు పాల్గొన్నారు.



జిల్లా కలెక్టర్ నుంచి ప్రతిభా పురస్కారం అందుకుంటున్న రమ్య

టీడీపీ గ్రామశాఖ అధ్యక్షుడు మృతి



మామిడికుదురు, జూన్ 12(ఆంధ్రజ్యోతి): ఈదరాడ తెలుగుదేశం పార్టీ గ్రామశాఖ అధ్యక్షుడు యెరుబండి నాగముత్యం (బాబి) గురువారం అనారోగ్యంతో మృతి చెందారు. గత నాలుగు రోజులుగా అనారోగ్యంతో చికిత్స తీసుకుంటూ గురువారం మృతిచెందడంతో ఆయన మృతదేహంపై టీడీపీ నాయకులు పార్టీ జెండా కప్పి నివాళులర్పించారు. కార్యక్రమంలో పార్టీ మండలశాఖ అధ్యక్షుడు మొల్లేటి శ్రీనివాస్, చాగంటి స్వామి, బోనం బాబు, కడలి కృష్ణమోహన్, మామిడిశెట్టి రాంబాబు, రమేష్ ఉన్నారు.

నాటుసారా నిర్వాహకుడి అరెస్టు

అమలాపురం రూరల్, జూన్ 12(ఆంధ్రజ్యోతి): ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఎస్కేడీవీ ప్రసాద్ ఆదేశాల మేరకు ఎక్సైజ్ ఎస్ఐ పి.బాలాజీ ఆధ్వర్యంలో కామనగరువుతో పాటు పలు గ్రామాల్లో విస్తృతంగా దాడులు నిర్వహించారు. కామనగరువులో రాజులపూడి నరేష్ నాటుసారా విక్రయాలు సాగిస్తుండగా అరెస్టుచేసి సారాను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్టు ఎక్సైజ్ సీఐ వీటీవీవీ సత్యనారాయణ గురువారం తెలిపారు. నరేష్‌ను కోర్టులో హాజరు పరుచగా 14 రోజులు రిమాండ్ విధించినట్టు సీఐ తెలిపారు.

బాలకార్మిక వ్యతిరేక దినోత్సవ బ్యానర్ ఆవిష్కరణ

అమలాపురం టౌన్, జూన్ 12(ఆంధ్రజ్యోతి): సహాయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో చేపడుతున్న సేవా కార్యక్రామల్లో భాగంగా ప్రపంచ బాలకార్మిక వ్యతిరేక దినోత్సవాన్ని నిర్వహించడంతో పాటు బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనకు చేస్తున్న కృషిని జిల్లా విద్యాశాఖాధికారి డాక్టర్ షేక్ సలీంబాషా అభినందించారు. బాలలకు పనిచేసే వాతావరణాన్ని కాదు చదువుకునే వాతావరణాన్ని సృష్టిద్దాం అంటూ రూపొందించిన బ్యానర్‌ను జిల్లా విద్యాశాఖాధికారి గురువారం ఆవిష్కరించారు. బడిఈడు పిల్లలంతా బడికి వెళ్లేందుకు ఫౌండేషన్ తరపున కృషి చేస్తామని చైర్మన్ చోడే రాంబాబు తెలిపారు.



బ్యానర్‌ను ఆవిష్కరిస్తున్న డీఈవో సలీంబాషా

విద్యార్థులకు విద్యామిత్ర కిట్ల పంపిణీ

అమలాపురంరూరల్, జూన్ 12(ఆంధ్రజ్యోతి): సమనస-వన్నెచింతలపూడి జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు జి.నాగసత్యనారాయణ అధ్యక్షతన గురువారం డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యామిత్ర కిట్ల పంపిణీ కార్యక్రమం చేపట్టారు. విద్యాకమిటీ చైర్మన్ ఎలిపే ముత్యాలబాబు సమక్షంలో ఆయా గ్రామాల సర్పంచ్‌లు పరమట శ్యామ్‌కుమార్, నక్కా రాజారత్నంనాగవాణి, ఎంపీటీసీ పరమట నాగమణి, ఉపసర్పంచ్ మామిళ్లపల్లి దొరబాబు, మాజీ సర్పంచ్ నడింపల్లి ఉదయబాబుల తో పాటు గ్రామపెద్దలు తొలిరోజు పాఠశాలకు హాజరైన విద్యార్థులందరికీ విద్యామిత్ర కిట్లను పంపిణీ చేశారు. సన్నబియ్యంతో తొలిరోజు చేసిన మధ్యాహ్న భోజనాన్ని రుచి చూసి నిర్వాహకులను అభినందించారు.

మామిడికుదురు: జిల్లాలో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యను అభ్యసించే విద్యార్థులకు ప్రభుత్వం అందించే సర్వేపల్లి రాధాకృష్ణ విద్యామిత్ర కిట్లను అందిస్తున్నట్టు సమగ్రశిక్ష జిల్లా సీఎంవో బీవీవీ సుబ్రహ్మణ్యం తెలిపారు. మండలంలోని నగరం ప్రాథమిక పాఠశాలలో ఆయన విద్యార్థులకు ఈ కిట్లను అందించారు. కార్యక్రమంలో ఎంఈవో మోకా వెంకన్నబాబు, హెచ్‌ఎం భావిశెట్టి వెంకటేశ్వరరావు, ఉపాధ్యాయులు పాలొగన్నారు.

ఉచిత కుట్టు శిక్షణ కార్యక్రమం పరిశీలన

పి.గన్నవరం, జూన్ 12(ఆంధ్రజ్యోతి): పి.గన్నవరంలో జరుగుతున్న ఉచిత కుట్టు శిక్షణ కార్యక్రమాన్ని గురువారం ఎంపీపీ గనిశె ట్టి నాగలక్ష్మి, ఎంపీడీవో కేవీ ప్రసాద్ పరిశీలించారు. ఈసందర్భంగా ట్రైనింగ్‌లో ఉన్న మహిళలను శిక్షణ గురించి అడిగి తెలుసుకున్నా రు. ఉదయం, మధ్యాహ్నం కలిపి 134 మంది మహిళలు శిక్షణ పొందుతున్నారని చెప్పారు. అనంతరం ఇప్పటి వరకు వారు నేర్చుకున్న అంశాలపై ఆరా తీశారు. ఎంపీడీవో వెంట ట్రైనింగ్ టీచర్ జి.తరంగిణి, సిబ్బంది ఉన్నారు.

ఘనంగా సామూహిక అక్షరాభ్యాసాలు

మామిడికుదురు, జూన్ 12(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని అన్ని గ్రామాల్లో సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమాలు ఐసీడీఎస్ ఆధ్వర్యంలో గురువారం ఘనంగా జరిగాయి. మామిడికుదురులో సర్పంచ్ గౌస్ మొహిద్దీన్, ఎంఈవో లక్ష్మీనారాయణలు చిన్నారులచే అక్షరాలు దిద్దించి కార్యక్రమాలను ప్రారంభించారు. ఆయా కార్యక్రమాల్లో గ్రామాల సర్పంచ్‌లతో పాటు సూపర్‌వైజర్లు పి.విజయలత, ఎస్.సుబ్బలక్ష్మి, బి.అన్నపూర్ణ పాల్గొన్నారు.

దిండిలో గ్రాడ్యుయేషన్ డే

మలికిపురం: దిండి అంగన్‌వాడీ సెంటర్‌లో గురువారం గ్రాడ్యుయేషన్ డే నిర్వహించారు. సర్పంచ్ ముదునూరి శ్రీనివాసరాజు పిల్లలను ఉద్దేశించి మాట్లాడారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ హైమావతి, తెలుగుదేశం పార్టీ నాయకుడు దోనిపాటి రాజు పాల్గొన్నారు.

అంబాజీపేట: గంగలకుర్రు అంగన్‌వాడీ కేంద్రంలో సామూహిక అక్షరభ్యాసం కార్యక్రమాన్ని ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మహాలక్ష్మి పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. చిన్నారులకు ఇష్టపడే విధంగా ఆటపాటలతో విద్యాబోధనలపై శిక్షణ ఇస్తున్నామన్నారు. అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు పాల్గొన్నారు.

'బాలల హక్కుల పట్ల అవగాహన కలిగి ఉండాలి'

పి.గన్నవరం, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు బాలల హక్కులపట్ల అవగాహన కలిగి ఉండాలని ప్రముఖ న్యాయవాది జి.శ్రీపావని సూచించారు. ముంగండ జిల్లా పరిషత్ ఉన్నత పాఠ శాలలో గురువారం బాలలహక్కులపై విద్యార్థులకు ఏర్పాటుచేసిన అవగాహన కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. అనంతరం రాజ్యాంగంపై విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించి బహుమతులు అందించారు. పాఠశాల విద్యాకమిటీ చైర్మన్ బి.శ్రీనివాసరావు, ప్రధానోపాధ్యాయులు డి.గీతాకళ్యాణి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బస్టాండ్‌లో సైకిల్ స్టాండ్ పేరిట దోపిడీ

అమలాపురంరూరల్, జూన్ 12(ఆంధ్రజ్యోతి): అమలాపురం ఏపీఎస్ ఆర్టీసీ బస్ డిపో ప్రాంగణంలో ప్రయాణికుల సౌకర్యార్థం ఏర్పాటుచేసిన సైకిల్ స్టాండ్ నిర్వాహకులు అధిక రేట్లు వసూలు చేస్తూ ప్రయాణికులను దోపిడీ చేస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. నిర్ణేశించిన రేట్లకంటే అధికంగా వసూలుచేస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. లీజు నిబంధనలను ఉల్లంఘించిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

కేజ్ కల్చర్ అభివృద్ధికి మరింత కృషి

మామిడికుదురు, జూన్ 12(ఆంధ్రజ్యోతి): కేజ్ కల్చర్ అభివృద్ధికి మరింత కృషి చేస్తున్నట్టు నాబార్డు ఏజీఎం సోమినాయుడు పేర్కొన్నారు. పెదపట్నం గ్రామంలోని గోదావరి ప్రాంతంలో ఉన్న కేజ్ కల్చర్‌ను ఆయన గురువారం పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ గోదావరి ఫిష్‌ఫార్మర్ ప్రొడ్యూసర్ కంపెనీ రిజిస్ట్రేషన్ పూర్తి చేసుకుందని, దీని ఆధారంగా ఈ కల్చర్‌ను అభివృద్ధి చేస్తామని, మెంబర్‌షిప్ కూడా ప్రారంభమైందన్నారు.

మండపేట

• కొత్తపేట • మండపేట • రామచంద్రపురం

వేణుగోపాలస్వామికి శ్రీపుష్పోత్సవం

ఆత్రేయపురం, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): ర్యాలీ జగన్మోహిని కేశవస్వామి క్షేత్ర పాలకుడు వేణుగోపాలస్వామి కల్యాణోత్సవాల్లో భాగంగా గురువారం స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. నిత్యార్చన, అమ్మవారికి కుంకుమార్చన, నిరాజన మంత్రపుష్పం తదితర కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం రాత్రి వివిధ రకాల పుష్పాలతో స్వామివారి శ్రీపుష్పయాగం నిర్వహించారు. కార్యనిర్వాహణ అధికారి బీహెచ్‌వీ రమణమూర్తి వాటి ఏర్పాట్లను పర్యవేక్షించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకుని శ్రీపుష్పోత్సవంలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.



ఆలమూరు ఎస్టీవోగా సుజాత బాధ్యతల స్వీకరణ



ఆలమూరు, జూన్ 12(ఆంధ్రజ్యోతి): ఆలమూరు సబ్‌ట్రెజరీ అధికారిగా వి. సుజాత గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈమె రాజమహేంద్రవరం ఎస్టీవో పనిచేస్తూ ఇక్కడికి బదిలీపై వచ్చారు. ఆలమూరులో పనిచేస్తున్న ఎస్టీవో హైదర్‌అలీ చింతూరుకు బదిలీపై వెళ్లారు. నూతన ఎస్టీవోగా బాధ్యతలు స్వీకరించిన ఆమెను పలువురు సిబ్బందితో పాటు ఉద్యోగుల సంఘాల నాయకులు అభినందించారు.



వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయంలో అష్టోత్తర పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

వాడపల్లి వెంకన్న ఆదాయం రూ.4.30 లక్షలు

ఆత్రేయపురం, జూన్ 12(ఆంధ్రజ్యోతి): వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయానికి గురువారం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులతో కిటకిటలాడింది. నోము ఆచరించిన భక్తులు అష్టోత్తర పూజలు, నిత్య కల్యాణాలు జరిపారు. స్వామివారిని దర్శించుకున్న అనంతరం భక్తులు అన్నప్రసాదంలో పాల్గొన్నారు. వివిధ సేవల ద్వారా ఒక్కరోజు ఆదాయం రూ.4,30,332 వచ్చినట్టు ఉపకమిషనరు, ఈవో నల్లం సూర్య చక్రధరరావు తెలిపారు. వకుళమాత అన్నదాన భవన నిర్మాణానికి ఆత్రేయపురం మండలం అంకంపాలానికి చెందిన కరుటూరి సత్యనారాయణ, వెంకటకృష్ణారావు, ఆలపాటి వెంకటేశ్వరరావు కుటుంబ సభ్యులు రూ.50,116 విరాళం ఇచ్చారు. ఆలయ సిబ్బంది దాతలకు స్వామివారి చిత్రపటం అందించారు.

అభివృద్ధి, సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట

ఏడాది పాలన విజయోత్సవంలో మంత్రి సుభాష్, ఎమ్మెల్యేలు వేగుళ్ల, బండారు



మండపేటలో కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే వేగుళ్ల

రామచంద్రపురం(ద్రాక్షారామ), జూన్ 12 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం పాలన చేపట్టిన ఏడాదిలో సంక్షేమం, అభివృద్ధితో జనరంజనక పాలన అందించామని మంత్రి సుభాష్ పేర్కొన్నారు. గురువారం రామచంద్రపురం టీడీపీ కార్యాలయంలో కూటమి ప్రభుత్వం ఏర్పాటు చేసి ఏడాది పూర్తయిన సందర్భంగా విజయోత్సవాన్ని నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మంత్రి సుభాష్ మాట్లాడారు. ప్రజల ఆకాంక్షల మేరకు పని చేస్తూ మంచి ప్రభుత్వంగా మన్ననలు పొందుతున్నామన్నారు. ఏడాది కాలంలో రామచంద్రపురం నియోజకవర్గాన్ని 125 కోట్ల నిధులతో అభివృద్ధి చేశామన్నారు. భవిష్యత్తులో మరిన్ని సంక్షేమ కార్యక్రమాలు చేపడతామన్నారు. అంతకుముందు కూటమి ప్రభుత్వం ఏడాది పూర్తయిన సందర్భంగా మంత్రి కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి పోలిశెట్టి చంద్రశేఖర్, వాసంశెట్టి సత్యం, దంగేటి గౌరీశంకర్, జాస్తి విజయలక్ష్మి, బళ్ల లక్ష్మి, బీజేపీ నాయకులు పలివెల రాజు, కూటమి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఏడాది కూటమిపాలన హిట్

ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు

మండపేట, (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తయిన నేపథ్యంలో బేష్ అయిన పాలన అందించిందని ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు అన్నారు. ఏడాది పాలన పూర్తయిన సందర్భంగా గురువారం టీడీపీ కార్యాలయం నుంచి బయలుదేరిన ర్యాలీ కేపీ రోడ్డు నుంచి ప్రారంభమై మెయిన్ రోడ్డు మీదుగా బస్టాండ్ వద్దకు చేరింది. ర్యాలీలో కూటమి అభివృద్ధి పనులను తెలిపారు. అనంతరం సూర్యమహల్‌లో జరిగిన విజయోత్సవ సభలో కేక్ కట్ చేశారు. ఎమ్మెల్యే వేగుళ్ల, మాజీ ఎమ్మెల్సీ వీవీవీఎస్ చౌదరి, కూటమి నేతలు కె.సత్యనారాయణ, సాయిరాం, నామాల చంద్రరావు తదితరులు ఈ సందర్భంగా మాట్లాడారు. సూర్యమహల్‌లో కేక్ కట్‌చేసి ఎమ్మెల్యేను కూటమినేతలు సత్కరించారు. కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ చుండ్రు శ్రీవరప్రకాష్, గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ నల్లమిల్లి వీరెడ్డి, జనసేన పట్టణ అధ్యక్షుడు నామాల చంద్రరావు, ఉంగరాల రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

ఆత్రేయపురం, (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది పాలన పూర్తయిన నేపథ్యంలో ఆయా ప్రాంతాల్లో విజయోత్సవాలు నిర్వహించారు. గురువారం కూటమి నాయకులు ఆయా ప్రాంతాల్లో బైక్ ర్యాలీ నిర్వహించారు. రాత్రి కేక్ కట్ చేసి సంబరాలు నిర్వహించుకున్నారు.కార్యక్రమంలో ముదునూరి వెంకట్రాజు, ముళ్ళపూడి భాస్కరరావు, కరుటూరి నరసింహారావు తదితరులతో పాటు కూటమి శ్రేణులు తది తరులు పాల్గొన్నారు.



రావులపాలెంలో ఎమ్మెల్యే బండారు సత్యానందరావు ఆధ్వర్యంలో విజయోత్సవం ర్యాలీ

రాష్ట్ర ప్రగతే ప్రభుత్వ లక్ష్యం

కొత్తపేట ఎమ్మెల్యే బండారు

రావులపాలెం (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర అభివృద్ధే ధ్యేయంగా కూటమి పాలన సాగిందని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తయిన సందర్భంగా కొత్తపేట నియోజకవర్గ కూటమి నేతలు విజయోత్సవ ర్యాలీ జరుపుకున్నారు. రావులపాలెం కళా వెంకట్రావు సెంటర్ చెంతకు ఎమ్మెల్యే బండారు సత్యానందరావు, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జ్ బండారు శ్రీనివాస్, తెలుగు రైతు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆకుల రామకృష్ణ, బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ అయినవిల్లి సత్తిబాబుగౌడ్, మాజీ డీసీఎంఎస్ చైర్మన్ కేవీ సత్యనారాయణరెడ్డి, తెలుగు యువత జిల్లా అధ్యక్షుడు చిలువూరి సతీష్‌రాజు తదితర నాయకులు, కూటమి నాయకులు, కార్యకర్తలతో కలిసి జాతీయ రహదారి మీదుగా ర్యాలీ నిర్వహించారు. అనంతరం జరిగిన సమావేశంలో వక్తలు మాట్లాడారు. కార్యక్రమంలో కొప్పిశెట్టి ప్రసాద్, గుత్తుల పట్టాభిరామారావు, బండారు బాబి తదితరులు పాల్గొన్నారు.

తాగునీరు సరఫరాపై హర్షం

కె.గంగవరం, జూన్ 12(ఆంధ్రజ్యోతి): కోట గ్రామానికి సత్యం ఫౌండేషన్ ద్వారా తాగునీరు సరఫరా చేస్తున్నారు. గ్రామంలో తాగునీటికి ప్రజలు అవస్థలు పడుతున్న విషయాన్ని కూటమి నాయకులు మంత్రి సుభాష్ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో వారి సమస్య పరిష్కారానికి ఆయన సత్యం ఫౌండేషన్ ద్వారా ట్యాంకర్ ఏర్పాటు చేశారు.

వెంకట్రాజు మృతికి సంతాపం

ఆత్రేయపురం, జూన్ 12(ఆంధ్రజ్యోతి): ఆత్రేయపురం సొసైటీ మాజీ అధ్యక్షుడు ముదునూరి వెంకట్రాజు(90) గురువారం మృతి చెందారు. ఈయనకు భార్య నలుగురు కుమారులు ఉన్నారు. ఈయన మృతిపై పలువురు సంతాపం తెలిపారు.

క్రీడా ప్రాంగణంలో మౌలిక వసతులకు కృషి

రామచంద్రపురం, జూన్ 12(ఆంధ్రజ్యోతి): రామచంద్రపురంలో కృత్తివెంటి పేర్రాజు పంతులు క్రీడా ప్రాంగణంలో మౌలిక వసతులు ఏర్పాటు చేయిస్తానని మంత్రి సుభాష్ హామీ ఇచ్చారు. గురువారం రాత్రి బాస్కెట్ బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన వేసవి శిక్షణ తరగతులు ముగింపులో మంత్రి పాల్గొని మాట్లాడారు. అనంతరం ఆల్ ఇండియా బాస్కెట్‌బాల్ అసోసియేషన్ కార్యదర్శి గన్నమని చక్రవర్తి మాట్లాడుతూ గత ఏప్రిల్ 6న బాస్కెట్‌బాల్ శిక్షణ శిబిరం ప్రారంభించి 120 మంది విద్యార్థులకు శిక్షణ ఇచ్చామన్నారు. త్వరలో రామచంద్రపురంలో రాష్ట్ర స్థాయి బాస్కెట్‌బాల్ పోటీలు నిర్వహిస్తామన్నారు. శిక్షణ పొందిన విద్యార్థులకు జ్ఞాపిక, సర్టిఫికెట్ మంత్రి సుభాష్ అందచేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ జి.శ్రీదేవి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు వుండవిల్లి గోపాలరావు, వెట ర్నరీ పాలిటెక్నిక్ ప్రిన్సిపాల్ జయలక్ష్మి, పీడీ ఎం.అప్పన్న తదితరులు పాల్గొన్నారు.

బ్రోచర్ ఆవిష్కరించిన మంత్రి

రామచంద్రపురం(ద్రాక్షారామ), జూన్ 12(ఆంధ్రజ్యోతి): పశుసంవర్ధక శాఖ ప్రగతి నివేదిక బ్రోచర్‌ను గురువారం మంత్రి ఆవిష్కరించారు. కార్యక్రమంలో పశుసంవర్ధకశాఖ జేడీ కె.వెంకట్రావు, ఏడీ రామకృష్ణ, పశుసంవర్ధకశాఖ అధికారులు పాల్గొన్నారు.

తాగునీటి సరఫరా ట్యాంకర్లు ప్రారంభం

రామచంద్రపురం నియోజకవర్గంలో తాగునీటి ఎద్దడి ఉన్న గ్రామాలకు రక్షిత మంచినీరు సరఫరా చేయడానికి రెండు వాటర్ ట్యాంకర్లను గురువారం మంత్రి ప్రారంభించారు. మంచి కార్యక్రమం నిర్వహణకు సీఎస్ఆర్ నిధులు వెచ్చించిన ఠాగూర్ లేబొరేటరీస్ ప్రైవేటు లిమిటెడ్, లీ ఫార్మల్ లిమిటెడ్ సంస్థలను మంత్రి అభినందించారు. కార్యక్రమంలో వాసంశెట్టి సత్యం, జనసేన ఇన్‌చార్జి చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన జనార్దనస్వామి కల్యాణోత్సవాలు

కపిలేశ్వరపురం, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): కపిలేశ్వరపురంలోనున్న జనార్ధనస్వామి కల్యాణోత్సవాలు గురువారంతో ముగిసాయి. ఈ సందర్భంగా బుధవారం రాత్రి స్వామివారి పుష్పయాగాన్ని పలువురు వేద పండితులు భాజాభజంత్రీలతో వేద మంత్రాల మధ్య శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం భక్తులకు ప్రసాద వితరణ జరిగింది. కార్యక్రమంలో గ్రామస్థులతో పాటు అధిక సంఖ్యలో మహిళలు, భక్తులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా సామూహిక అక్షరాభ్యాసం



రామచంద్రపురంలోని అంగన్‌వాడీ కేంద్రానికి ఇండక్షన్ స్టౌవ్ ఇస్తున్న మంత్రి సుభాష్

ద్రాక్షారామ, జూన్ 12(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం అమలు చేస్తున్న విద్యా విధానంతో మెరుగైన ప్రమాణాలతో విద్యాబోధన జరుగుతుందని మంత్రి సుభాష్ అన్నారు. గురువారం రామచంద్రపురం మండలం పరిషత్ కార్యాలయంలో 105 అంగన్‌వాడీ కేంద్రాలకు ప్రెషర్ కుక్కర్లు, ఇండక్షన్ స్టవ్‌లు పంపిణీ చేశారు. అనంతరం సామూహిక అక్షరాభ్యాసంలో అయిదుగురు చిన్నారులతో అక్షరాభ్యాసం చేయించారు. కార్యక్రమంలో ఎంపీపీ అంబటి భవానీ, సీడీపీవో వీవీ వరహాలక్ష్మి, ఎంపీడీవో కడలి పద్మజ్యోతి, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమానికి ప్రాధాన్యం

ఎమ్మెల్యే వేగుళ్ల

రాయవరం, (ఆంధ్రజ్యోతి): అభివృద్ధి, సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు అన్నారు. గురువారం రాయవరం శ్రీరామయ్య జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎమ్మెల్యే పలు అభివృద్ధి పనులను ప్రారంభించారు. విద్యార్థులనుద్దేశించి ఆయన మాట్లాడుతూ విద్యతోనే సమాజాభివృద్ధి సాధ్యమన్నారు. తొలుత పాఠశాలలో నిర్మించిన డిజిటల్ లైబ్రరీ, కిచెన్ గార్డెన్, ఇంకుడు గుంత, వాకింగ్ ర్యాంపు, ప్లే గ్రౌండ్‌లను ప్రారంభించారు. హైస్కూల్ విద్యార్థులకు సర్వేపల్లి రాధాకృష్ణ విద్యామిత్ర కిట్లు, బ్యాగ్‌లను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజనం పథకంలో భాగంగా విద్యార్థులకు సన్న బియ్యంతోతో వండిన భోజనాన్ని ఎమ్మెల్యే, ప్రజా ప్రతినిధులు రుచిచూసి నాణ్యత పరిశీలించారు. కార్యక్రమంలో గ్రామాభివృద్ధి కమిటీ ఛైర్మన్ ఉండవిల్లి రాంబాబు, ఎంపీపీ నౌడు వెంకటరమణ, రామచంద్రపురం డీవైఈవో పి.రామలక్ష్మణమూర్తి, ఎంపీడీవో ఎన్.కీర్తి స్పందన, ఎంఈవో వై.సూర్యనారాయణ తదితరులతో పాటు పలువురు అధికారులు, ప్రజా ప్రతినిధులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

ఆత్రేయపురం, (ఆంధ్రజ్యోతి): ఆత్రేయపురం మండలం ర్యాలి సెక్టార్ పరిధిలోని సచివాలయం వద్ద గురువారం మన అంగన్‌వాడీ పిలుస్తుందిలో భాగంగా సామూహిక అక్షరభ్యాసం నిర్వహించారు. ఐసీడీఎస్ సీడీపీవో గజలక్ష్మి పాల్గొని ఐసీడీఎస్ ఆధ్వర్యంలో చేపడుతున్న కార్యక్రమాలను తెలిపారు. సర్పంచ్ కొడమంచిలి లక్ష్మి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పద్మావతి, గ్రామపెద్దలు సామూహిక అక్షరాభ్యాసంలో పాల్గొన్నారు. అక్షరభ్యాసం కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు.

అంగన్‌వాడీ కేంద్రంలో...

కపిలేశ్వరపురం, (ఆంధ్రజ్యోతి): వడ్లమూరు గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాసం నిర్వహించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఐ.మాణిక్యం ఈ సందర్భంగా మాట్లాడారు. అయిదేళ్లు నిండిన చిన్నారులకు గ్రాడ్యుయేషన్ డే, అంగన్‌వాడీ పిలుస్తోంది కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం ర్యాలీ జరిపారు. శ్రమ స్వచ్ఛంద సంస్థ సభ్యులు దుర్గారావు, రమణయ్య, భవాని తదితరులు మాట్లాడుతూ మూడేళ్లు నిండిన పిల్లలందరినీ అంగన్ వాడీ కేంద్రాల్లో చేర్పించాలన్నారు. కార్యక్రమంలో శ్రమ స్వచ్ఛంద సంస్థ సభ్యులు శారద, నాగరాజు, సచివాలయ, ఆరోగ్య సిబ్బంది, ఎంఎల్‌హెచ్‌పి, ఆశ, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు, తల్లులు, చిన్నారులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాలను సద్వినియోగం చేసుకోండి

ఆలమూరు, (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ కేంద్రాలను ప్రతి ఒకరు సద్వినియోగం చేసుకోవాలని ఐసీడీఎస్ సీడీపీవో గజలక్ష్మి కోరారు. మండలంలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో గురువారం సామూహిక అక్షరాభాస్యం కార్యక్రమాల్లో భాగంగా ఆలమూరు, చింతలూరు గ్రామాల్లో నిర్వహించారు. చిన్నారులతో అక్షరాభాస్యం చేయించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు టీఎస్వీ నాగలక్ష్మి, వై.అరుంధతి, బి.వరలక్ష్మి, ఆరోగ్య సిబ్బంది కృష్ణవేణి, సంధ్యారాణి, వరలక్ష్మి, ఆశ, అంగన్‌వాడీ వర్కర్లు పాల్గొన్నారు.



రాయవరంలో అభివృద్ధి పనుల శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే వేగుళ్ల తదితరులు



మండపేటలో నిరసన తెలుపుతున్న కాంట్రాక్ట్ కార్మికులు

కొనసాగుతున్న కాంట్రాక్ట్ కార్మికుల రిలే నిరాహార దీక్షలు

మండపేట, జూన్ 12(ఆంధ్రజ్యోతి): మున్సిపల్ ఇంజనీరింగ్ విభాగంలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికుల డిమాండ్‌లను సత్వరమే పరిష్కరించాలని కోరుతూ ఉద్యోగులు చేస్తున్న రిలే నిరాహార దీక్షలు గురువారం 20వ రోజుకు చేరుకున్నాయి. మండపేట మున్సిపల్ కార్యాలయం ముందు కార్మికులు మోకాళ్లపై నిలబడి ప్రదర్శన చేశారు. తమకు పనికి తగ్గ వేతనం చెల్లించాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కార్మికులు పిట్టా ప్రవీణ్ కుమార్, మండపాటి గన్నియ్య, కప్పల అన్నవరం, బాలరాజు, వాసు, సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల హాజరుశాతం పెంపుదలకు కృషి చేయాలి

ఆత్రేయపురం, జూన్ 12(ఆంధ్రజ్యోతి): విద్యార్థుల హాజరు శాతం పెంపొందించేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని ఎంఈవో వరప్రసాదరావు పేర్కొన్నారు. మండలంలో 53 ప్రభుత్వ, 12 ప్రైవేట్ వేసవి సెలవుల అనంతరం ప్రారంభయ్యాయన్నారు. నూతన విద్యా సంవత్సర క్యాలెండర్‌ను అనుసరించి పాఠ్య ప్రణాళిక తయారు చేసుకుని సిలబస్, విద్యా సంబంధ కార్యక్రమాలు త్వరతగతిన పూర్తి చేసుకోవాలన్నారు. ప్రభుత్వ పాఠశాలలకు పాఠ్య పుస్తకాలు, నోట్ పుస్తకాలు అందించామన్నారు.



గంగవరం పాఠశాలలో విద్యార్థులకు పుస్తకాలు అందజేస్తున్న మమ్మీ

విద్యార్థులకు ఆసక్తి కలిగేలా బోధన చేయాలి

కె.గంగవరం, జూన్ 12(ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు ఆసక్తి కలిగించేలా విద్యాబోధన చేయాలని సమగ్రశిక్ష అడిషనల్ ప్రాజెక్ట్ కో ఆర్డినేటర్ జి.మమ్మీ అన్నారు. గురువారం కె.గంగవరం, దంగేరు ఉన్నత పాఠశాలలను ఆమె పరిశీలించారు. ఆయా పాఠశాలల్లో తరగతి గదులు, నిర్మాణంలో ఉన్న భవనాలు పరిశీలించి ప్రధానోపాధ్యాయుల నుంచి వివరాలు తెలుసుకున్నారు. ఆరో తరగతిలో కొత్తగా చేరిన విద్యార్థులకు స్వయంగా పుస్తకాలు అందజేశారు. కార్యక్రమంలో జీసీడీవో ఎం.ఏ.కె. భీమారావు, జిల్లా సైన్స్ అధికారి జీవీఎస్ సుబ్రహ్మణ్యం, ఎంఈవో1 ఏ.నాగరాజు, ఎంఈవో2 చోడిశెట్టి ఆంజనేయులు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు పి.వెంకటేశ్వరరావు, శ్రీనివాస్, మాగాపు ప్రదీప్ కుమార్, సీఆర్‌పీలు వెంకన్నబాబు, రమణ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలి

రాయవరం, జూన్ 12(ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ కేంద్రాల్లో, ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను విద్యార్థులు, తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలని టీడీపీ గ్రామశాఖ అధ్యక్షుడు మేడపాటి రవీంద్రారెడ్డి అన్నారు. గురువారం మాచవరం గ్రామంలో ఐసీడీఎస్ మాచవరం సెక్టార్ సూపర్‌వైజర్ వి.విష్ణుకుమారి ఆధ్వర్యంలో గ్రాడ్యుయేషన్ డే, సామూహిక అక్షరాభ్యాసం నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ సీతామహాలక్ష్మి మాట్లాడుతూ మూడేళ్లు నిండిన చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించాలన్నారు. అనంతరం చిన్నారులకు గ్రాడ్యుయేషన్ డే నిర్వహించి ప్రభుత్వ పాఠశాలలో చేర్పించారు. కార్యక్రమంలో తీపర్తి రమేష్, గవరసాని కుమారి, మేకా శ్యామ్ సుందర్, అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లు, విద్యార్థుల తల్లులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు కష్టపడి చదువుకోవాలి

మండపేట, జూన్ 12(ఆంధ్రజ్యోతి): పాఠశాలలు తెరిచేనాటికే ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు అందించటంతో పాటు మెరుగైన వసతులు కల్పిస్తామని మండపేట మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ పతివాడ నూకదుర్గారాణి అన్నారు. మండపేటలోని 20వ వార్డులో వున్న పాఠశాలలో గురువారం వేగుళ్ల వీర్రాజు మున్సిపల్ హైస్కూల్ పాఠశాల విద్యార్థులకు డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ విద్యామిత్ర కిట్స్‌ను పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ వార్డు ఇన్‌చార్జి ఎం.సూర్యప్రకాష్, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

మండపేట రూరల్‌లో: ద్వారపూడి జిల్లా పరిషత్ బాలికల హైస్కూల్లో గురువారం విద్యార్థులకు విద్యా కమిటీ చైర్మన్ కె.మురళీకృష్ణ నేతృత్వంలో విద్యార్థులకు పాఠశాల పుస్తకాల కిట్లు అందజేశారు. మధ్యాహ్న భోజనం పరిశీలించారు.

తొలిరోజు పాఠశాలల్లో తగ్గిన విద్యార్థుల హాజరు

మండపేట, జూన్, 12(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలలు తెరుచుకున్న తొలిరోజు గురువారం విద్యార్థుల హాజరుశాతం కొంచెం పలచగా కనిపించింది. మండలంలో మొత్తం విద్యార్థులు 4900 మందికి తొలిరోజు 1250 మంది మాత్రమే హాజరయ్యారు, పాఠశాలలు తెరుచుకున్న తొలిరోజు విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు, అందించారు. ఏడిదలో వున్న నామాలపురుషోత్తం జిల్లా పరిషత్ హైస్కూల్‌లో విద్యార్థుల హాజరు పరిశీలించారు. విద్యార్థులతో కలిసి ఆయన మధ్యాహ్న భోజనం రుచిచూడటంతో పాటు ఎంఈవో భోజనం చేశారు.

56వ రోజుకు చేరిన శ్రీవాణి దీక్ష

మండపేట, జూన్ 12(ఆంధ్రజ్యోతి): కేశవరం జిల్లా పరిషత్ హైస్కూల్ ప్రహరీ నిర్మించాలంటూ గ్రామానికి చెం దిన వల్లూరి శ్రీవాణి చేస్తున్న రిలే నిరాహారదీక్ష గురువారం 56 రోజుకు చేరింది. ప్రహరీ నిర్మించే వరకు దీక్ష కొనసాగిస్తానని తెలిపారు. ఇన్ని రోజుల నుంచి దీక్షను చేస్తున్నప్పటికీ పట్టించుకోని పాలకుల తీరును ఆమె దుయ్యపట్టారు. పాఠశాల ఆస్తి కోసం తాను చేస్తున్న దీక్షకు స్పందించని నాయకులపై ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వం స్పందించి ప్రహరీ నిర్మాణానికి చర్యలు తీసుకోవాలన్నారు.



అభివృద్ధి పనులకు భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే వేగుళ్ల, చైర్‌పర్సన్ తదితరులు

అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే భూమిపూజ

మండపేట, జూన్, 12(ఆంధ్రజ్యోతి): మండపేటలో గురువారం పలు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే వేగుళ్ల, చైర్‌పర్సన్‌తో కలిసి శంకుస్థాపనలు చేశారు. పట్టణంలో 15 నుంచి 22 వార్డుల్లో చేపట్టే రోడ్డు పనులకు ఆయన భూమిపూజ చేశారు. కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ చుండ్రు శ్రీవరప్రకాష్, కమిషనర్ టీవీ రంగారావు, డీఈఈ శ్రీనివాస్, కౌన్సిలర్‌లు కాళ్లకూరి స్వరాజ్యభవాని, బొక్కా సరస్వతి, కాశీన కాశీవిశ్వనాధం, ఎం.రవికుమార్, కె.బేబి, ఎం.సీతామహలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

గర్భిణి వైద్యానికి దాతలు ఆర్థికసాయం

కొత్తపేట, జూన్ 12(ఆంధ్రజ్యోతి): కొత్తపేట రామారావుపేటకు చెందిన ఎస్.ప్రణిత ఏడు నెలల గర్భిణి కాగా పిట్స్‌తో బాధపడుతూ ప్రాణాప్రాయ స్థితికి చేరింది. ఆమెను హైదరాబాద్‌లోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించి వైద్యం అందిస్తున్నారు. ఈ నేపథ్యంలో స్థానిక జితేంద్ర సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆమె పరిస్థితిని వివరిస్తూ దాతల సాయం కోరారు. దాతలు స్పందించి రూ.2లక్షలు పైబడి ఆర్థికసాయం ఫౌండేషన్‌కు పంపించారు. దీంతో గురువారం టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు రెడ్డి సుబ్రహ్మణ్యం చేతులు మీదుగా రూ.2లక్షల చెక్కును ప్రణిత కుటుంబానికి అందచేశారు. దీంతో జితేంద్ర ఫౌండేషన్‌కు సాయం అందించిన దాతలకు వారు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కొత్తపేట ఉపసర్పంచ్ విళ్ల మారుతీప్రసాద్, కెనారా బ్యాంక్ మేనేజర్ రాజేష్, ఉందుర్తి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



బాధిత కుటుంబానికి చెక్కు అందచేస్తున్న టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు రెడ్డి